

# పల్లె వెలుగు

తెలుగు జాతీయ దిన పత్రిక

అవినీతిపై నిఘా

GST No.37ACDFM5465G1Z1

RNI-APTEL/2012/46499

No: KNL/3`78(D)/2026`2028

ఎస్ ఐ ఆర్", పేరుతో ఓట్ల తొలగింపు ఆపాలి.



Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad


ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ సంపుటి -14 సంచిక - 240 పేజీలు - 08 వెల - 05/- బుధవారం 26-08-2026


## అఖండ గోదారిని ఆరాధించేలా

# పుష్కరాలు

**181 కొత్త ఘాట్ల నిర్మాణంతో సహా 440 ఘాట్ల అభివృద్ధి**

- భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు, పవిత్రతకు పెద్దపీట
- 10 కోట్ల మంది పుణ్య స్నానాలు చేస్తారని అంచనా
- మొత్తం రూ.4,026 కోట్ల వ్యయంతో 4,932 పనులు
- గోదావరి పుష్కరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



అమరావతి, ఆగస్ట్ 25: ప్రకృతి ఆరాధన-ఆధ్యాత్మిక చింతన మమేకం చేస్తూ గోదావరి పుష్కరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఎక్కడా పవిత్రత దెబ్బతినకుండా, భక్తులకు సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జూలై 7 వరకు 12 రోజుల పాటు పుష్కరాలు అత్యంత వైభవంగా జరపాలని చెప్పారు. పుష్కరాలు కేవలం ప్రభుత్వం నిర్వహించడమే కాదని, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పుష్కరాల్లో భాగంగా రూ.4,026 కోట్లతో చేపట్టిన 4,932 పనులకు సంబంధించి పురోగతిపై సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సమీక్షించారు. పుష్కరాలకు ఇంకా 10 నెలల సమయమే ఉన్నందున త్వరితగతిన అన్ని పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అయితే ఈ పనులకు సంబంధించి ఇప్పటికే రూ.899 కోట్లు ఆర్థిక శాఖ కేటాయింపులు జరిగాయని అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి తెలిపారు. వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో

మిగతా 2లో

## ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు

# ప్రమాణ స్వీకారం..

- విజయవాడలో ఆయనతో ప్రమాణం చేయించిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరు



ఆంధ్రప్రదేశ్ నూతన లోకాయుక్తగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ తల్లాప్రగడ మల్లిఖార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని లోక్‌భవన్‌లో మంగళవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై, నూతన లోకాయుక్తగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ మల్లిఖార్జునరావుకు పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వకంగా మిగతాది 2లో

# కార్యకర్తలకు అండగా నిలవాలి: జగన్

- కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు వెనుకాడవద్దని పిలుపు
- పోటీలు లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని హెచ్చరిక
- పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వ్యాఖ్య



స్థానిక సంస్థల ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగితే కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇస్తారని వైసీపీ అధినేత జగన్ ధీమా వ్యక్తం చేశారు. పార్టీ ముఖ్యనేతలతో ఈరోజు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, రాబోయే స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు.

మిగతాది 2లో

# జీవో 77పై థియేటర్ యజమానుల రగడ


- టికెట్ ధరల జీవో ఏకపక్షమంటూ సీఎంకు ఎగ్జిబిటర్ల ఫిర్యాదు
- నిబంధనలు నిర్మాతలకు అనుకూలంగా ఉన్నాయని ఆరోపణ
- సింగిల్ స్క్రీన్లను ఏసీలుగా మార్చాలనడం భారమంటున్న ఓనర్లు



తెలంగాణలో సినిమా టికెట్ ధరల నియంత్రణకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో 77పై వివాదం ముదురుతోంది. ఈ జీవో ఏకపక్షంగా ఉందని, కేవలం నిర్మాతలకు మేలు చేసేలా రూపొందించారని ఆరోపిస్తూ తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాసింది. స్టేట్ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వంటి కీలక భాగస్వామ్య పక్షాలను సంప్రదించకుండా, కేవలం తెలుగు యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారని వారు అభ్యంతరం వ్యక్తం చేశారు.టికెట్ ధరల పెంపు వల్ల ఎగ్జిబిటర్లకు ఎటువంటి లాభం లేదని, థియేటర్ల నిర్వహణ, సిబ్బంది వేతనాలు, విద్యుత్ బిల్లులు వంటి ఆర్థిక భారాలన్నింటినీ తామే భరిస్తున్నామని వారు స్పష్టం చేశారు. మిగతాది 2లో

# 22ఏ బాధితులకు న్యాయం చేయాలి: హరీశ్‌రావు

- లక్షలాది మందికి కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపాటు
- పొంగులేటి అత్యాశ ఆయన దుఃఖానికి కారణమవుతుందని వ్యాఖ్య



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి లక్ష్యంగా బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కుత్బుల్లాపూర్‌లో నిర్వహించిన 22ఏ (22ఇూ) బాధితుల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే వివేకానందతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తప్పు చేసింది ప్రభుత్వమైతే, కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని ప్రశ్నించారు. వందలాది కాలనీల అధ్యక్షులు, వేలాది మంది బాధితులు తమ భూములను నిషేధిత 22ఏ జాబితాలో పెట్టారంటూ ఆవేదనతో ఇక్కడికి వచ్చారని హరీశ్ రావు పేర్కొన్నారు.

మిగతాది 2లో

# ఏపీలో సమ్మె

## విరమించిన జూనియర్ డాక్టర్లు

- సమ్మె విరమిస్తున్నట్టు కోర్టుకు తెలిపిన జూనియర్ డాక్టర్లు
- తమ డిమాండ్లు నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోర్టుకు విన్నపం
- రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన హైకోర్టు



ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న జూనియర్ వైద్యుల (జూడా) సమ్మెకు తెరపడింది. తమ సమ్మెను విరమిస్తున్నట్లు జూనియర్ వైద్యుల సంఘం ప్రతినిధులు హైకోర్టుకు స్వయంగా నివేదించారు.

మిగతాది 2లో



# అనంతపురం యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు

**-సుజ్లాన్ భాగస్వామ్యంతో 12 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ**

- రాయదుర్గంలో సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- రూ.10 వేల కోట్ల పెట్టుబడితో 4 వేల మందికి పైగా ఉపాధి
- పునరుత్పాదక ఇంధనంలో ఏపీని నంబర్ వన్‌గా నిలబెట్టడమే లక్ష్యం
- రాష్ట్రవ్యాప్తంగా 22 పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటుకు ప్రణాళికలు

*పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యమని, సుజ్లాన్ పవన విద్యుత్ ప్రాజెక్టులు ఈ ప్రయాణంలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతున్నాయని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. మంగళవారం అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం, కణేకల్లు మండలం హులికెర వద్ద సుజ్లాన్ విండ్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో లోకేష్ మాట్లాడుతూ..*

సుజ్లాన్‌తో ఏపీకి ఉన్న రెండు దశాబ్దాల బంధం పునరుద్ధరణ కావడం సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛ ఇంధనం ప్రపంచ ప్రాధాన్యతగా మారకముందే దానిపై నమ్మకం ఉంచి, దేశ ఇంధన స్వావలంబనకు పునాదులు వేసిన దివంగత తులసి తంతిని ఈ సందర్భంగా స్మరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఆయన దార్శనికతకు అనంతపురంలోనే బలమైన పునాది పడిందని గుర్తుచేశారు. భారత పవన విద్యుత్ రంగాన్ని ప్రపంచ పటంలో నిలిపిన సంస్థ సుజ్లాన్ అని కొనియాడారు. ఎన్నో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నప్పటికీ, నిబద్ధతతో కూడిన సంస్కృతితో సుజ్లాన్ సంస్థ నిలదొక్కుకుందని ప్రశంసించారు.గత ఐదేళ్లలో (2019-24) రాష్ట్రంలో పవన విద్యుత్ రంగం పూర్తిగా నిలిచిపోయిందని, కేవలం 6 మెగావాట్ల సామర్థ్యం మాత్రమే అదనంగా చేరిందని లోకేశ్ విమర్శించారు. నేడు ఒక్క అనంతపురంలోనే సుజ్లాన్ యూనిట్‌కు ఏటా 1,260 మెగావాట్ల తయారీ

మిగతాది 2లో

# ఆరోగ్యం క్షీణించడంతో

## దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలకు డిమాండ్‌గా 48 గంటల దీక్షకు పిలుపు
- రక్తపోటు పడిపోవడంతో రెండో రోజే దీక్షను ముగించాలని సూచించిన సీనియర్ నేతలు
- నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేసిన ఎంపీ కె. లక్ష్మణ్
- రూ.15,000 కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమన్న బీజేపీ



2

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు రెండో రోజే విరమించారు. దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు. సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు.

# ఆరోగ్యం క్షీణించడంతో దీక్ష విరమించిన తెలంగాణ బీజేపీ చీఫ్

దీక్షలో ఉండగా ఆయన ఆరోగ్యం క్షీణించడంతో, పార్టీ



సీనియర్ నేతల సూచన మేరకు మంగళవారం దీక్షను ముగించారు. సోమవారం ప్రారంభమైన ఈ దీక్షలో రాంచందర్ రావు ఆరోగ్యం మంగళవారం క్షీణించింది. ఆయన రక్తపోటు (బీపీ) గణనీయంగా పడిపోవడంతో పార్టీ శ్రేణులు ఆందోళనకు గురయ్యాయి. దీంతో, సీనియర్ నేతలు దీక్షను విరమించాలని ఆయనకు సూచించారు. అనంతరం, పార్టీ సీనియర్ నేత, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్.. రాంచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. అంతకుముందు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర నేతలు దీక్షా శిబిరానికి వచ్చి రాంచందర్ రావుకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు గురించి ఆలోచించాలని హితవు పలికారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

దీక్ష విరమించడానికి ముందు రాంచందర్ రావు 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "తెలంగాణ విద్యార్థుల గొంతుక.. 58 ఏళ్ల యువ నేతగా చెప్పుకునే వ్యక్తికి కానీ, హైదరాబాద్‌లోని ఆయన గులాంకు కానీ వినిపించడం లేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం కావడంతో 40 లక్షల మంది విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు దూరమవుతున్నారు" అని ఆయన ఆరోపించారు. దాదాపు రూ.15,000 కోట్ల బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "యువతకు తామే సంరక్షకులమని చెప్పుకోవడం కాంగ్రెస్ పార్టీకి ఉన్న ఓ బూటకం. తెలంగాణ యువత మేల్కొంది, ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉంది" అని రాంచందర్ రావు హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాష్ట్ర విద్యావ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, రేపు ఇదే యువత ప్రభుత్వాన్ని గద్దె దించుతుందని ఆయన అన్నారు.

# అనంతపురం యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు

మందికి ఉపాధి లభిస్తోందని, వారిలో 70 శాతానికి పైగా స్థానికులేనని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుజ్లాన్ ఇప్పటికే 2 వేలకు పైగా గ్రీన్ ఉద్యోగాలు సృష్టించిందని వివరించారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల ద్వారా 1,325 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. దీని కోసం సుమారు రూ.10 వేల కోట్ల పెట్టుబడి వస్తుండగా, ప్రత్యక్షంగా, పరోక్షంగా 4 వేలకు పైగా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే ఏపీలో సుజ్లాన్‌కు 1,600 మెగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, మరో 2,700 మెగావాట్లు నిర్మాణ దశలో ఉన్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 6.5 గిగావాట్ల డేటా సెంటర్ల సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని, వీటికి నిరంతరాయ విద్యుత్ అందించడానికి సౌర, పవన, నిల్వ సాంకేతికతలు కలిసి పనిచేయడం అత్యంత కీలకమని లోకేశ్ అన్నారు. ఈ డిజిటల్ మౌలిక వసతుల కోసం సుమారు 25 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన అవకాశాలు సృష్టించవచ్చని అంచనా వేశారు. "క్లీన్ ఎనర్జీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాగా మార్చి, ప్రపంచానికి ఎగుమతి చేసేలా ఏపీని 'క్లీన్ ఎనర్జీకి సౌదీ అరేబియా'గా తీర్చిదిద్దడమే మా అంతిమ లక్ష్యం," అని లోకేశ్ స్పష్టం చేశారు. రాష్ట్ర స్థాయిలో 175 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఈ లక్ష్య సాధనలో సుజ్లాన్ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎనర్జీ, డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, ఆటోమొబైల్ వంటి అధిక వృద్ధి రంగాల్లో 22 పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. కేవలం ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, దాని చుట్టూ పూర్తి పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ విధానమని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం, సుజ్లాన్ కలిసి 12 వేల మంది యువతకు గ్రీన్ ఎనర్జీ ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వనున్నాయని, ఇందులో 25 శాతం మహిళలకు ప్రాతినిధ్యం కల్పిస్తామని లోకేశ్ ప్రకటించారు. ఉరవకొండ, విజయవాడలోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఈ రంగానికి అవసరమైన నిపుణులను సిద్ధం చేస్తాయని అన్నారు. ఒకప్పుడు ఉపాధి కోసం వలస వెళ్లే అనంతపురం జిల్లాకు ఇప్పుడు కియా కార్లు, ఫైటర్ జెట్లు, సుజ్లాన్ రెన్యూవబుల్ ఎనర్జీ కొత్త చిరునామాగా మారాయని లోకేశ్ అన్నారు. విజనరీ ముఖ్యమంత్రి చంద్రబాబు వల్లే ఇది సాధ్యమైందని, ఇతర ప్రాంతాల వారు ఉద్యోగాల కోసం అనంతపురానికి వచ్చే రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. తన పాదయాత్రలో కియా పరిశ్రమ ఎన్నో కుటుంబాల్లో వెలుగు నింపడం చూశానని, అప్పుడే 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని లోకేశ్ గుర్తుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కంపెనీలను తీసుకురావడం తమ బాధ్యత అని, అవకాశాలను అందిపుచ్చుకోవడం యువత బాధ్యత అని పిలుపునిచ్చారు. "ప్రభుత్వం, పరిశ్రమలు, యువత కలిసి పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చు. ఏపీపై విశ్వాసం ఉంచిన సుజ్లాన్ బృందానికి ధన్యవాదాలు. పెట్టుబడిదారులు మా ప్రభుత్వ వేగాన్ని, నిబద్ధతను నమ్మండి. స్వచ్ఛ ఇంధనం, కొత్త పరిశ్రమలు, నైపుణ్యాలతో భవిష్యత్తును మనమే నిర్మించుకుందాం" అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు.

# అఖండ గోదారిని ఆరాధించేలా పుష్కరాలు

వీటిలో పట్టణాభివృద్ధి, ఆర్ అండ్ బీ, జల వనరులు,



విద్యుత్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి అత్యధిక పనులు ఉన్నాయి. ఇందులో తూర్పు గోదావరి జిల్లాలో 1,869, పశ్చిమ గోదావరి జిల్లాలో 625, కోనసీమ జిల్లాలో 1,501, ఏలూరు జిల్లాలో 426, కాకినాడ జిల్లాలో 321, పోలవరం జిల్లాలో 190 పనులు చేపడుతున్నారు. అయితే ఈ పనుల పూర్తికి అవసరమైన నిధుల సమీకరణపై అధికారులు దృష్టి పెట్టాలని, కేంద్ర సాయం కూడా తీసుకోవాలని అధికారులకు సీఎం సూచించారు.

### 2027 పుష్కరాలకు భారీగా భక్తులు

2015 మహా పుష్కరాల్లో ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 4.86 కోట్ల మంది భక్తులు పుణ్య స్నానాలు చేయగా. 2027లో 8 నుంచి 10 కోట్ల మంది గోదావరి పుష్కరాలకు తరలి వస్తారని అంచనా వేస్తున్నట్టు అధికారులు వివరించారు. రోజుకు సుమారు కోటి మంది పుణ్య స్నానాలు చేసే అవకాశం ఉందన్నారు. రద్దీని తట్టుకునేలా మొత్తం 440 ఘాట్లు సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిలో ప్రస్తుతం ఉన్న 259 ఘాట్లను అభివృద్ధి చేయడంతో పాటు అదనంగా 181 కొత్త ఘాట్లను నిర్మిస్తున్నామన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో 82 ఘాట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 40 ఘాట్లు, కోనసీమ జిల్లాలో 175 ఘాట్లు, ఏలూరు జిల్లాలో 44 ఘాట్లు, కాకినాడ జిల్లాలో 88 ఘాట్లు, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు.

### టెంపుల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

గోదావరి పరివాహక ప్రాంతంలో ఎన్నో పుణ్యక్షేత్రాలు ఉన్నాయని... పిఠాపురంలో శక్తి పీఠం సహా పంచారామాల్లో 4 క్షేత్రాలు, ఇంకా ద్వారకా తిరుమల, అన్నవరం, వాడపల్లి, అంతర్వేది వంటి ప్రధాన ఆలయాలను కలుపుతూ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులు పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించేందుకు వీలుగా హోం స్టేలను ప్రోత్సహించాలని సూచించారు. కొత్తగా హోటళ్ల నిర్మాణం చేపట్టేవారికి త్వరితగతిన అనుమతులు ఇవ్వాలన్నారు. సమీక్షలో ఇంకా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'రాజమహేంద్రవరంలో వివిధ కార్యక్రమాల నిర్వహణ కోసం కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలి. దేశ విదేశాల్లో ప్రముఖులు అందరికీ గోదావరి పుష్కరాలకు ఆహ్వానం అందించాలి. రాష్ట్ర విశిష్టత తెలిసేలా, ప్రతిష్ట పెరిగేలా చేసేందుకు ఇదొక అవకాశంగా భావించాలి. కూచిపూడి ఈవెంట్ వంటివి భారీ తరహాలో నిర్వహించేలా దేవా దాయ-పర్యాటక శాఖలు ప్రణాళికలు రూపొందించాలి. పుష్కర ఘాట్లను కలిపే రహదారుల నిర్మాణం సహా, పుష్కరాలు జరిగే 6 జిల్లాలో ఏ రోడ్లపైనా గుంతలు కనిపించకూడదు. పోలవరం ప్రాజెక్టును సందర్శించేలా రహదారుల నిర్మాణం జరగాల్సి ఉంది. బ్రిడ్జిల సామర్థ్యాన్ని పరిశీలించి, దానికి అనుగుణంగా మరమ్మతులు చేయాలి. గోదావరిలో చుక్క కూడా మురుగు నీరు కలవకుండా చూడాలి. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలి. హేవ్‌లాక్ బ్రిడ్జి, సమీపంలో దీవుల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి.' అని నిర్దేశించారు.

### రద్దీ నిర్వహణకు ఏఐ వినియోగం

ఈసారి పుష్కరాల్లో భద్రత, రద్దీ నిర్వహణకు ఏఐ ఆధారిత క్రౌడ్ అనలిటిక్స్, సీసీటీవీ ఎంట్రీ-ఎగ్జిట్ మానిటరింగ్, డ్రోన్ సర్వైలెన్స్, క్యూఆర్ ఆధారిత వాహన గుర్తింపు, డీసెంట్రలైజ్డ్ డిప్లాయ్‌మెంట్ సిస్టమ్ వంటి సాంకేతికత వినియోగిస్తున్నట్టు అధికారులు తెలిపారు. వైద్య సేవల పరంగానూ ఎటువంటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. అంబులెన్స్‌లు, ఫస్ట్ ఎయిడ్, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు. 30 ఫీల్డ్ ఆస్పత్రులను తాత్కాలిక ప్రాతిపదికన ఏర్పాటు చేసి, వాటికి అనుబంధంగా ల్యాబ్‌లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు.

### మోడల్ పుష్కర పంచాయతీగా ముని కూడలి


గోదావరి నదీ పరివాహక జిల్లాల్లోని 260 గ్రామ పంచాయతీలలో 50 గ్రామ పంచాయతీలను మోడల్ పుష్కర పంచాయతీలుగా అభివృద్ధి చేయ తలపెట్టారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని ముని కూడలిని పైలట్ మోడల్ పుష్కర పంచాయతీగా ఎంపిక చేశారు. కొవ్వూరు--పోలవరం మీదుగా పట్టిసీమ రోడ్డు, సీతానగరం నుంచి సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ వరకు దీ రోడ్డు, అలాగే అవెన్యూ ప్లాంటేషన్, బ్యూటిఫికేషన్... సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్ నుంచి కొవ్వూరు వరకు రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. రాజమహేంద్రవరం--పోలవరం మధ్య జాతీయ రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పుష్కరాలు కాలుష్య రహితంగా చేసేందుకు 487 గ్రీన్ ఎనర్జీ బస్సులు వినియోగించనున్నారు. అలాగే 11 బస్‌స్టేషన్లను ఆధునీకరిస్తున్నారు. నదిలో భక్తుల భద్రతకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 2,697 రెస్క్యూ బోట్లు సిద్ధం చేయడంతో పాటు, 8,955 శిక్షణ పొందిన ఈతగాళ్లను పుష్కరాల సమయంలో నియమించనున్నారు.

### అఖండ గోదావరికి పుష్కర ఏర్పాట్లు

గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు, దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రపంచస్థాయి మౌలిక వసతులు, రవాణా, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్య సేవలు, భద్రత, వసతి, సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర ఏర్పాట్లను అద్భుతంగా చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. గోదావరి జన్మస్థానం నుంచి సముద్ర సంగమం వరకు అనేక ఉప నదులు, వాగులు, ఏరులు కలుస్తున్నందున 'అఖండ గోదావరి' పేరుతో పుష్కరాలు నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, బీసీ జనార్ధన్ రెడ్డి, వై సత్యకుమార్ యాదవ్, గోదావరి పుష్కరాల ప్రత్యేకాధికారి, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీవో 77పై థియేటర్ యజమానుల రగడ

కరోనా అనంతర కాలంలో ప్రేక్షకులకు మెరుగైన అనుభూతిని అందించేందుకు గత మూడేళ్లలో సుమారు రూ. 300 కోట్లు వెచ్చించి థియేటర్లను ఆధునీకరించామని, అయితే ప్రస్తుత నిబంధనల వల్ల టికెట్ ధరలను నిర్ణయించే హక్కును కూడా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



పాతన నిబంధనల ప్రకారం టైర్-2, టైర్-3 పట్టణాల్లోని ఎయిర్-కూల్డ్ థియేటర్లను ఏసీ థియేటర్లుగా మార్చాలంటే ఒక్కో స్క్రీన్‌కు సుమారు రూ. 60 నుండి 80 లక్షల వరకు వ్యయమవుతుందని, ఈ ఆర్థిక భారాన్ని భరించలేక ఇప్పటికే అనేక థియేటర్లు మూతపడ్డాయని వారు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 400కు పైగా సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఉండగా, వాటిపై సుమారు 20,000 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని గుర్తుచేశారు. ఈ జీవో అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని థియేటర్లు మూతపడి, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, చిత్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచే ఎగ్జిబిటర్ల ప్రయోజనాలను కాపాడే విధంగా జీవో 77ను పునఃసమీక్షించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, ఆయన చొరవ తీసుకుని తమ సమస్యలను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

# ఏపీలో సమ్మె విరమించిన జూనియర్ డాక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

జూనియర్ వైద్యుల సమ్మెపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై హైకోర్టు ఈరోజు విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా, విధుల్లోకి చేరుతున్నామని చెబుతూనే సమ్మెను విరమిస్తున్నట్లు జూడాలు న్యాయస్థానానికి స్పష్టం చేశారు. అదే సమయంలో, తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. జూనియర్ వైద్యులు లేవనెత్తిన డిమాండ్లపై సానుకూలంగా స్పందించిన హైకోర్టు, వారి సమస్యల పరిష్కారంపై రెండు వారాల్లోగా తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ఇచ్చిన ఈ స్పష్టమైన ఆదేశాలతో జూనియర్ వైద్యులు తమ నిరసనను ఉపసంహరించుకోవడంతో, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు తిరిగి సాధారణ స్థితికి చేరుకున్నాయి.

# కార్యకర్తలకు అండగా నిలవాలి: జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకు సంబంధించినవి మాత్రమే కావని... క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమిస్తున్న కార్యకర్తలకు అండగా నిలబడాల్సిన కీలక సమయమని జగన్ పేర్కొన్నారు. గతంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో అధికార దుర్వినియోగం, దౌర్జన్యాలు చూశామన్న ఆయన.. ఈసారి ప్రతి స్థానంలోనూ సమర్థులైన, బలమైన అభ్యర్థులను పోటీకి దింపాలని సూచించారు. అవసరమైతే నాయకులు తమ కుటుంబ సభ్యులను సైతం బరిలోకి దించేందుకు వెనకాడకూడదని పిలుపునిచ్చారు. ఏ నియోజకవర్గంలోనూ పోటీ లేకుండా ఏకగ్రీవాలకు తావు ఇవ్వకూడదని... ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అక్కడి కో-ఆర్డినేటర్లు భవిష్యత్తులో అసెంబ్లీ అభ్యర్థులుగా కొనసాగలేరని హెచ్చరించారు. పార్టీ కేడర్ బలోపేతం కోసం 14 నుంచి 15 లక్షల క్యూఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు కార్డులు సిద్ధమయ్యాయని... సెప్టెంబరు 5 నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించి వీటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 'వెన్నుపోటు పార్టీ -- వెన్నుపోటు పాలన' అనే నినాదంతో గ్రామ స్థాయిలో వైసీపీ - కూటమి పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలను రక్షించుకోవడానికి నియోజకవర్గ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు లీగల్, మీడియా సెల్స్‌ను బలోపేతం చేయాలని... అవసరమైతే కేసులు హైకోర్టు వరకు తీసుకెళ్లేలా సమన్వయ వ్యవస్థ ఉండాలని తెలిపారు. అలాగే సోషల్ మీడియాను పూర్తి స్థాయిలో ఉపయోగించుకోవాలని, 'జగన్ 2.0 సూపర్ యాప్', యూట్యూబ్, ఎక్స్ వంటి వేదికల ద్వారా నిజాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరుతూ, రాజకీయ ఒత్తిళ్లతో చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారుల పేర్లను డిజిటల్ బుక్‌లో నమోదు చేసి, భవిష్యత్తులో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాయకులు తమ ఈగోలను పక్కనపెట్టి, రాబోయే 60-70 రోజులు నియోజకవర్గాల్లోనే ఉంటూ స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# 22ఏ బాధితులకు న్యాయం చేయాలి: హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)


"భూములను 22ఏలో పెట్టడం మీ వంతు.. మళ్లీ వాటిని తొలగించుకోవడానికి దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగడం ప్రజల వంతా?" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సూటిగా నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పును వెంటనే సవరించాల్సిన బాధ్యత మంత్రిపైనే ఉందన్నారు. లక్షలాది మంది ఆస్తులను రాత్రికి రాత్రి 22ఏ జాబితాలో చేర్చి, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేశారని మండిపడ్డారు. 30 శాతం కమీషన్ల దురాశతోనే ఈ భూములన్నింటినీ 22ఏలో పెట్టారంటూ హరీశ్ రావు ఆరోపించారు. మంత్రి అత్యాశ ఏదో ఒకరోజు ఆయన దుఃఖానికి కారణమవుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ కుట్రల వల్ల లక్షలాది మంది జీవితాలు నాశనమవుతున్నాయని... పిల్లల పెళ్లిళ్లు ఆగిపోతున్నాయని, దవాఖాన ఖర్చుల కోసం ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెడదామంటే బ్యాంకులు సైతం తీసుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రాపర్టీల విలువలు పడిపోయి, అప్పు పుట్టక, ఆస్తులు అమ్ముకోలేక బాధితులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. కాబట్టి ప్రజలతో ఆన్‌లైన్ దరఖాస్తులు పెట్టించకుండా, ప్రభుత్వం వెంటనే ఈ 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# ఏపీ లోకాయుక్తగా జస్టిస్ మల్లిఖార్జునరావు ప్రమాణ స్వీకారం..

అభినందనలు తెలిపారు. ప్రమాణ స్వీకారం ముగిసిన అనంతరం జస్టిస్ మల్లిఖార్జునరావు, ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్ కాసేపు ముచ్చటించారు. పరిపాలనలో పారదర్శకత, అవినీతి నిర్మూలనకు లోకాయుక్త వ్యవస్థ ప్రాధాన్యాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేసుకున్నారు. అనంతరం లోక్‌భవన్‌లో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్, ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు, న్యాయశాఖకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. జస్టిస్ మల్లిఖార్జునరావు నియామకంతో రాష్ట్రంలో పరిపాలన మరింత జవాబుదారీగా మారుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు.

# జగన్‌పై అచ్చెన్నాయుడు తీవ్ర విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)



సమాజంలో క్రిమినల్స్‌కు అందరూ భయపడతారని, వారు చేసే పనులు సమాజానికి ఎంతో హానికరమని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అలాంటి నేర చరిత్ర కలిగిన వ్యక్తులు రాజకీయ పార్టీ పెట్టి రాజకీయం చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. క్రిమినల్స్ తాము చేసిన తప్పులను ఇతరులపైకి తోసేసి, చివరికి తామే బాధితులుగా చిత్రీకరించుకునే ప్రయత్నం చేస్తారని మంత్రి మండిపడ్డారు. తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ ఎంతమందిని జైలుకు పంపించారో ప్రజలందరికీ బాగా తెలుసని వ్యాఖ్యానించారు. అలాగే 2019లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలోని ప్రకృతి వనరులను విచ్చలవిడిగా దోచుకున్నారని ఆరోపించారు. బలహీన వర్గాలను అడ్డుపెట్టుకుని, వారి మెడపై కత్తి పెట్టి మరీ వేధింపులకు గురిచేశారని మంత్రి విమర్శించారు. గొడ్డలి పార్టీ అధినేత జగన్ ఆర్థికంగా విపరీతంగా బలపడ్డారని, కానీ బలహీన వర్గాలను మాత్రం బాధితులుగా మార్చేశారని ధ్వజమెత్తారు. లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అరెస్ట్ చేసిన వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావు వ్యవహారాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉండి రాష్ట్రానికి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. అలాగే మాజీ మంత్రి జోగి రమేశ్ వ్యాఖ్యలపై స్పందిస్తూ... "జోగి రమేశ్.. నీ కుటుంబ వ్యవహారంతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు గానీ, మంత్రి లోకేశ్ కు గానీ ఏం సంబంధం? మీలాంటి నీచ చరిత్ర చంద్రబాబుకు, లోకేశ్ కు లేదు. ముందు ఆ విషయాన్ని తెలుసుకోవాలి" అని హితవు పలికారు. 2014 నుంచి 2019 వరకు సాగిన తెలుగుదేశం పాలనే రాష్ట్రంలోని బీసీలకు నిజమైన స్వర్ణయుగమని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# త్వరలోనే టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తాం: రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్.

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని స్థానిక ఎస్ఆర్‌బీసీ కాలనీలో





ఉన్న టిడ్కో గృహ సముదాయాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పనుల పురోగతిని, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల కల్పనను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలి ఉన్న పనులను నాణ్యతా ప్రమాణాలతో, యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఫరూక్ ఆదేశించారు. అర్హులైన పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని హంగులతో ఇళ్ల పూర్తి చేసి అతి త్వరలోనే లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , పబ్బతి వేణు, బుగ్గ రాముడు, మరాఠీ సూరి మరియు సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి: ఏవో

మహానంది, పల్లె వెలుగు రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా పొందాలని




మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం నంది పల్లెలో గ్రామంలో 'పోలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ.. పంటల బీమా నమోదు చేసుకోవడానికి ఫార్మర్ ఐడి తప్పనిసరి అని తెలిపారు. వరి, కంది, మినుము, మొక్కజొన్నతో పాటు ఏ పంటనైనా ప్రభుత్వ సంస్థలకు మద్దతు ధరపై విక్రయించాలంటే ఫార్మర్ ఐడి తప్పనిసరి అన్నారు. ఇంకా ఫార్మర్ ఐడి పొందని లేదా పెండింగ్‌లో ఉన్న రైతులు వెంటనే రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. పంట రుణాలు తీసుకున్న రైతులు వరి పంటకు బీమా చేయించుకోవడానికి ఈ నెల 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

# కుక్కల గురించి పట్టించుకోరా!

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 25 : ఇందు గలవు! అందు లేవని సందేహం



వలదు! ఏ సందులో చూసినా కుక్కల మయమే! బండి ఆత్మకూరులో కుక్కల సంచారం అధికం కావడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసిన గుంపులు గుంపులుగా కుక్కలు దర్శనమిస్తున్నాయి. పాఠశాలలకు పిల్లలను పంపాలంటే తల్లిదండ్రులు భయపడిపోతున్నారు. ఎక్కడ తమ పిల్లలపై దాడి చేస్తాయో అని తల్లడిల్లి పోతున్నారు. బండి ఆత్మకూరు సంత మార్కెట్లోనూ, ప్రైవేట్ పరిసరాల్లో, చికెన్ సెంటర్ ల వద్ద కుక్కలు అధికంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో కుక్కలు గ్రూపులుగా ఏర్పడి, తమ సామ్రాజ్యాన్ని విస్తరింప చేసుకుంటున్నాయి. తమ ప్రాంతం వైపు మరే కుక్క రాకుండా పెత్తనం చెలాయిస్తున్నాయి. రాత్రిపూట బస్టాండ్ నుండి పాదచారులు ద్విచక్ర వాహనదారులు గ్రామంలోకి రావాలంటేనే హడలిపోతున్నారు. పార్నపల్లి, ఏ కోడూరు గ్రామాలలో రాత్రిపూట ద్విచక్ర వాహనాలు దారుల వెంటపడి కుక్కలు వేధిస్తున్నాయి. ద్విచక్ర వాహనదారుల వెంట కుక్కలు వెంటపడి భయాందోళనలను సృష్టిస్తున్నాయి. కుక్కలు వెంట పడడంతో ఎంతోమంది కిందపడి గాయాల పాలైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. చికెన్ షాప్ సెంటర్ ల వద్ద వ్యర్థ పదార్థాలను పడేస్తూ ఉండటంతో కుక్కలు ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గత రెండు సంవత్సరాల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల బెడదను నివారించడంలో చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దృష్టిలోప నివారణ నేత్రదాన జాతీయ పక్షోత్సవాల ర్యాలీ.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నేత్రదానం వల్ల అందులకు కంటి చూపు వస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ కే నాగరాణి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా నివారణ మరియు దృష్టిలోప నివారణ నేత్రదాన జాతీయ పక్షోత్స వాల ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ ప్రారంభించారు . ఈరోజు నుండి సెప్టెంబర్ 8వ తరగతి వరకు జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వము నిర్వహిస్తుంది. నేత్రదానం గురించి విస్తృత ప్రచారం చేయడం మరియు ప్రజలకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఆరోగ్యవంతులు షుగర్ ఉన్నవాళ్లు బిపి ఉన్నవాళ్లు కంటి అద్దాలు వాడుతున్న వాళ్లు ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయవచ్చునని అధికారులు తెలిపారు . ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారు కుక్క కాటుకు గురి అయిన వారు నల్ల గుడ్డు దెబ్బతినినవాళ్లు హెపటైటిస్ బి తో ఉన్నవాళ్లు నేత్రదానం చేయకూడదని తెలిపారు . ఒక వ్యక్తి కళ్ళను దానం చేయడం వల్ల ఇద్దరు అందులకు చూపును ఇవ్వడం సాధ్యమవుతుందని , కంటికి కన్ను మీ సంకల్పం కావాలి నేత్రదానం మనందరికీ ఆదర్శం కావాలి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ కే నాగరాణి, డాక్టర్ కె ఎస్ పి శ్రీనివాసులు, డాక్టర్ యశోదర, జిల్లా మాస్ మీడియా అధికారి మల్లేపల్లి పామున్న, ఆప్తాలు మీకు ఆఫీసర్లు కిషోర్ ప్రసాద్, సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్", పేరుతో ఓట్ల తొలగింపు ఆపాలి.

- లాజికల్ ఎక్రిపెన్సీని నిలిపివేయాలి.




పల్లె వెలుగు నంద్యాల రూరల్. రాష్ట్రంలో ఎస్ ఐ ఆర్ పేరుతో జరుగుతున్న ఓటర్ల ఎంపిక ప్రక్రియలో అప్రజా స్వామీక రాజ్యాంగ వ్యతిరేక చర్యలను నిలిపివేయాలని, లాజికల్ అగ్రీఫెన్సీ పేరుతో లక్షలాది ఓటర్లను అనుమానాస్పదులుగా మార్చడం వెంటనే ఆపాలని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కే ఎం ఎస్ ఎన్నికల కమిషన్ను కోరారు.

**నంద్యాల పర్యటనలో భాగంగా, ఆయన**

25- 08- 26 న స్థానిక క్రాంతి రేఖ గ్రంథాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, జాతీయస్థాయిలో జెన్జీ, జెన్ ఆల్ఫా ఉద్యమాలు మన దేశ విద్యా వ్యవస్థ దుస్థితిని ప్రపంచానికి తెలిపాయని, బిజెపి రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి ముసుగును చించి పడవేశాయని, సోదాహరణంగా వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈసీఐ ద్వారా తనకు అవసరమైన ఓటర్లను ఎంపిక చేసుకునే కుట్రలు "ఎస్ ఐ ఆర్" ద్వారా చేస్తుందని విమర్శించారు. తొలగించిన ఓట్లు 45 లక్షలు కాగా, అనుమానాస్పదులుగా మరో నలభై నాలుగు లక్షల 20వేల మందిని రాష్ట్రంలో "ఎస్ ఐ ఆర్" ద్వారా ఈసిఐ ఓట్ల తొలగింపుకు పాలు పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్, రాజ్యాంగం ద్వారా ప్రతి ఒక్కరికి ఒక ఓటు, ప్రతి ఓటుకు ఒకే విలువ అందించగా సాధారణ ప్రజల ఓట్లను ఎస్ఐఆర్ ద్వారా తొలగించి తన మనువాద ఆర్ఎస్ఎస్ స్వభావాన్ని కేంద్ర ప్రభుత్వం బహిరంగపరచుకుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తమై, ప్రజా సంఘాలు, పౌర సమాజాలు, న్యాయవాదులు తమ సహకారాన్ని సాధారణ ప్రజలకు అందించి, వారికి సాంకేతికంగా అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం నోటీసులు అందుకున్న సాధారణ ప్రజలు వారికి అందుబాటులో ఉన్న ఆధారాలనే అధికారులు గౌరవించి అంగీకరించి వారి ఓటును ఓటు హక్కును రాజ్యాంగ హక్కును పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. "రాజ్యాంగ హక్కులైన సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సాంస్కృతిక, బహుళత్వాలసంరక్షణకు " వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా" నిబద్ధతతో శ్రమిస్తుంది.

ఈ కార్యక్రమంలో నంద్యాల వెల్ఫేర్ పార్టీ ఇన్చార్జ్ సి అన్సర్ బాషా అధ్యక్షతన జరగగా, పుర ప్రముఖులు నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ గౌరవ అధ్యక్షులు ఎస్ ముహమ్మద్ అబులైస్, జమాతే ఇస్లామీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ సమ్మద్, ఆర్ పి ఎస్ స్టేట్ యూత్ ప్రెసిడెంట్ శివ క్రిష్ణ యాదవ్, ఆర్ పి ఎస్ జిల్లా ప్రెసిడెంట్ యస్ శ్రీనివాసులు అబ్దుల్ బాసిత్, అస్లాం, ఇషాక్, జిక్రియ, అలీమ్, ఫయాజ్, అల్లాబకష్, బషీర్, పఠాన్ షఫి, సాదక్, షబ్బీర్, యునుస్, ఫయాజ్, ఇద్మాద్, ఖ్వాజా, మహమ్మద్, సలీం భాషా, కరీం, కార్యకర్తలు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పీఎం సూర్య ఘర్ యోజనతో ప్రతి ఇంటికీ వెలుగులు


**- సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్లలో నాణ్యత ముఖ్యం - కనీసం 20 ఏళ్లు మన్నిక ఉండేలా చూడాలి - రాచుమర్రిలో ప్లాంట్‌ను పరిశీలించిన మంత్రులు గొట్టిపాటి, నిమ్మల**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనతో విద్యుత్ ఆదాతో పాటు ప్రతి కుటుంబానికి ఆర్థిక ప్రయోజనం చేకూరాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మంత్రాలయం మండలం రాచుమర్రి గ్రామంలో లబ్ధిదారుడు అజయ్ కుమార్ ఏర్పాటు చేసుకున్న సోలార్ రూఫ్‌టాప్ ప్లాంట్‌ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి మంత్రులు ప్లాంట్ పనితీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

**నాణ్యతా ప్రమాణాల్లో రాజీ వద్దు**

ప్లాంట్ల ఏర్పాటులో అత్యున్నత ప్రమాణాలు పాటించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.

20 ఏళ్ల మన్నిక: అమర్చే సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్లు నాణ్యమైనవిగా ఉండాలని, అవి కనీసం





20 సంవత్సరాల పాటు సమర్థవంతంగా పనిచేసేలా ఉండాలని స్పష్టం చేశారు.

స్వచ్ఛమైన ఇంధనం: ప్రతి ఇంటిపై సౌర విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా వినియోగదారులకు విద్యుత్ బిల్లుల భారం తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణ: పథకం ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ నేరుగా చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

60 శాతం వరకు సబ్సిడీ రాచుమర్రిలో ఏర్పాటు చేసిన ప్లాంట్ 2 కిలోవాట్ల సామర్థ్యంతో నడుస్తోందని, ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి 60 శాతం వరకు సబ్సిడీ లభిస్తోందని అధికారులు మంత్రులకు వివరించారు. ఏపీఎస్పీడీసీఎల్ (ఝూఝూణజూ) ద్వారా ప్రజలకు సాంకేతిక సహకారం, మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆదోని ఆర్డీవో అరుణ దేవి, విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రదీప్ కుమార్, టీడీపీ జిల్లా అధ్యక్షులు గుడిసి కృష్ణమ్మ, జోన్-5 ఇన్‌చార్జి శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు 'స్ఫూర్తి' కరపత్రాల విడుదల: బీజేపీ ఓబీసీ మోర్చా

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో సంచార, అర్ధసంచార జాతీయ విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 30, 31వ తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు జోన్లలో "స్ఫూర్తి" పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు కేపీ మంజునాథ్, కేపీ మద్దిలేటి తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రచార కరపత్రాలను బుధవారం (ఆగస్టు 26న) ఉదయం 11 గంటలకు కర్నూలు నంద్యాల చెక్ పోస్ట్ వద్ద ఉన్న పార్టీ క్యాంప్ కార్యాలయంలో విడుదల చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా అధ్యక్షుడు అక్కమతోట రామకృష్ణ సహకారంతో, జిల్లా ఓబీసీ




మోర్చా అధ్యక్షుడు ఉల్చాల లక్ష్మణ్ నాయుడు ఆధ్వర్యంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి బీజేపీ, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారులు, నగర-మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

# రాయలసీమ జోనల్ తైక్వాండో విజేతలకు అభినందన.

**● పతకాలు సాధించిన విజేతలను అభినందించిన డాక్టర్ రవి కృష్ణ. ● తైక్వాండో కోచ్ లు సర్దార్, బాలకృష్ణ, షానవాజ్ శిక్షణలో విజయాలు సాధించిన క్రీడాకారులు. ● భవిష్యత్తు లో మరిన్ని విజయాలకు నిరంతర సాధన అవసరం: డాక్టర్ రవి కృష్ణ.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ఉమ్మడి కర్నూలు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గత శని, ఆదివారాలలో నంద్యాల రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో, ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి చంద్రమౌళి పర్యవేక్షణలో నిర్వహించిన రాయలసీమ జోనల్ స్థాయి తైక్వాండో పోటీలలో విజయం సాధించిన నంద్యాల పట్టణ క్రీడాకారులను మంగళవారం లయన్స్ క్లబ్ అంతర్జాతీయ సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్, ఉమ్మడి కర్నూలు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా పి.ఆర్.ఓ. సుధాకర్ రెడ్డి అభినందించారు. నంద్యాల పట్టణంలో సర్దార్, బాలకృష్ణ, షానవాజ్ మాస్టర్లు శిక్షణ ఇచ్చిన వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన తైక్వాండో క్రీడాకారులు పలువురు విజేతలుగా నిలిచారు. సర్దార్, షానవాజ్ మాస్టర్లు శిక్షణ ఇచ్చిన క్రీడాకారులు 4 బంగారు పతకాలు, 8 రజత పతకాలు,5 కాంస్య పతకాలు సాధించగా, బాలకృష్ణ మాస్టర్ శిక్షణ ఇచ్చిన క్రీడాకారులు 5 బంగారు పతకాలు,3 రజత





పతకాలు,3 కాంస్య పతకాలు సాధించారు.

ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన మాస్టర్లు సర్దార్, బాలకృష్ణ, షానవాజ్ లకు డాక్టర్ రవి కృష్ణ అభినందనలు తెలిపారు. డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ క్రీడలలో విజయం సాధించినవారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడానికి క్రమశిక్షణ, అంకితభావంతో కూడిన నిరంతర సాధన మాత్రమే ఏకైక మార్గం అన్నారు. బాలికలకు తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇప్పించడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ జిల్లా పి. ఆర్.ఓ. సుధాకర్ రెడ్డి, కోచ్ లు బాలకృష్ణ, షానవాజ్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**స్వర్ణ పతకాలు సాధించిన క్రీడాకారులు:**

సఖియా, ఈశ్వర చారి,మేఘన,సారిక, నాగరామ చరణ్,ప్రణతి సాయి,నవనీత్,సుకుమార్ శామ్యూల్,మోక్షిత. రజత పతకాలు సాధించిన విజేతలు: తనుజ, సహారా, మధురిక్ రెడ్డి, మధుసూదన్, మౌనీశ్వర్, సాక్షి, సౌమ్య, రాణి, ధార్మిక్ సాయి, సాయి వర్ధిని, భవ్య శ్రీ. కాంస్య పతకాలు సాధించిన విజేతలు: హేమ సాయి, అఫ్రాన్, సమీరా, నిక్షిత్, అష్రాఫ్, ఆదిత్య, సుశాంక్, తమన్ పథకాలు సాధించారు.

# నంద్యాల 1వ వార్డులో నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**● రూ. 90 లక్షల నిధులతో మిగిలిన పనుల పునరుద్ధరణ. ● త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తాగునీరు.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని 1వ వార్డు పరిధిలో గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 80 శాతం పూర్తయి, మిగిలిన 20 శాతం పనులు నిలిచిపోయిన తాగునీటి ఓవర్‌హెడ్ ట్యాంక్ (వాటర్ ట్యాంక్) నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సంబంధిత మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఆయన నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పనుల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం పార్టీ హయాంలో 80% పనులు పూర్తయి 20% పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని వాటిని గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఐదేళ్ల హయాంలో పూర్తి చేయలేక పోయిందని అనంతరం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వార్డు ప్రజల తాగునీటి ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించేందుకు నిలిచిపోయిన వాటర్ ట్యాంక్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సంకల్పించడం జరిగిందని . ఇందుకోసం డీపీఎస్ మరియు ఎల్ఆర్ఎస్ నిధుల నుంచి రూ. 90 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నిధులతో ట్యాంక్ స్లాబ్ పనులు, పైప్‌లైన్ల అనుసంధానం, పెయింటింగ్ పనులు మరియు అవసరమైన ఇతర మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేసి, త్వరలోనే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, టిడిపి రాష్ట్ర యువనాయకులు ఎన్ఎండి ఫయాజ్, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సుమలత , నంద్యాల ఒకటో వార్డు టిడిపి



నాయకులు గురు ప్రసాద్, ప్రసాదు (బల్లి), మధు కుమార్, గుల్లి, సుంకయ్య, బాలమదిలేటి, పెద్ద స్వామి, రాజు, కాశమ్మ, ఆరంగుల శేఖర్, లోకేష్ , లెజెండ్ శీను, ఈశ్వరయ్య, వెంకట దాస్ మరియు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు, 1వ వార్డు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# క్రైస్తవుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది: రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్.

**నంద్యాలలో ఘనంగా క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అసోసియేషన్ దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు. హాజరైన రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండీ ఫయాజ్.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని ఎస్ఆర్‌బీసీ కాలనీలో గల బెతెస్త తెలుగు బాప్తిస్టు ప్రార్థన మందిరంలో 'క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ అసోసియేషన్' ఆధ్వర్యంలో మంగళవారం దైవసేవకుల ఆత్మీయ అవగాహన సదస్సు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , టీడీపీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్రంలో క్రైస్తవ సమాజ సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, సమానత్వం, సేవా భావాన్ని పెంపొందించడంలో దైవసేవకుల పాత్ర ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. క్రైస్తవులకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలు, ప్రయోజనాలు చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ ప్రతినిధులు క్రైస్తవుల సంక్షేమం, ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మంత్రి ఫరూక్ కు వినతిపత్రం అందజేశారు .

ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న , టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు, టీడీపీ క్రిస్టియన్ సెల్ పట్టణ అధ్యక్షులు బిషప్ డా. కె. బాలచంద్రుడు, వాక్యోపదేశకులు బిషప్ డా. ఇమ్మానుయేలు సన్నిధి, రెవ. డా. మారివూరి నాగేంద్రబాబు, తోట్టెంపూరి చంద్రశేఖర్, రెవ. ఇటికిల మల్లికార్జున, పాస్టర్ రాజేష్, పాస్టర్ అన్నపురెడ్డి రాజేష్, పాస్టర్ వై. రమేష్ బాబు, పాస్టర్ ఆశీర్వాదం, పాస్టర్ టి. యోనాతాన్, పాస్టర్ అశోక్ కుమార్, పాస్టర్ పి. జోషువా, పాస్టర్ కిషోర్ కుమార్, బుగ్గ రాముడు , మరాఠీ సూరి తదితర సంఘ పెద్దలు, దైవసేవకులు, విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గజ్జహాళ్లిలో బావి ఈరన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఘన ఏర్పాట్లు

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 25 గజ్జహళ్లి గ్రామంలోని బావి ఈరన్న స్వామి దేవస్థానంలో రేపు విగ్రహ ప్రతిష్ఠ, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహ ప్రతిష్ఠతో పాటు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం పూజకు అవసరమైన సామగ్రి మొత్తం దేవస్థానం వద్దే అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు భక్తులు, గ్రామ ప్రజలు సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.







# హైదరాబాద్ యశోద హాస్పిటల్ కు ఈ ఎల్ ఎస్ ఓ ప్లాటినం గుర్తింపు.




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. హైదరాబాద్ యశోద హాస్పిటల్ కు ఈ ఎల్ ఎస్ ఓ ప్లాటినం గుర్తింపుగా వచ్చినట్లు డాక్టర్ నిశాంత్ తెలిపారు. ఈ సందర్భంగా సూరజ్ గ్రాండ్ హోటల్ నందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ మాట్లాడుతూ యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి క్రిటికల్ కేర్ ఈ సి ఎం ఓ అవయవ మార్పిడి ఎయిర్ ఆంబులెన్స్ సేవలలో అత్యాధునిక వైద్య సేవలను అందిస్తూ అరుదైన అంతర్జాతీయ గుర్తింపు పొందిందని డాక్టర్ నిశాంత్ తెలిపారు . ఎక్స్ ట్రాకార్పోరియల్ లైఫ్ సపోర్ట్ ఆర్గనైజేషన్(ఈ ఎల్ ఎస్ ఓ) నుండి లైఫ్ సపోర్ట్ లో ఎక్స్ లెన్స్ కు అత్యున్నత స్థాయి ప్లాటినం గుర్తింపు యశోద హాస్పిటల్ కు లభించిందని అన్నారు. హైటెక్ సిటీకి చెందిన క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్, ఐ సి యు కన్సల్టెంట్ డాక్టర్ నిశాంత్ యశోద హాస్పిటల్ లో అందుబాటులో ఉన్న ఈ సి ఎం ఓ క్రిటికల్ కేర్ ట్రాన్స్ ప్లాంట్ మరియు ఎయిర్ అంబులెన్స్ సేవలను వివరించారు. డాక్టర్ నిశాంత్ ఈ ప్లాటినం గుర్తింపు పేషెంట్ భద్రత, క్లినికల్, ఎక్స్ లెన్స్ అంతర్జాతీయ ప్రమాణాలపై యశోద హాస్పిటల్ ఇచ్చే ప్రాధాన్యతకు సాక్ష్యమని తెలిపారు.


# సర్ నమోదులో లోపాలు సవరించాలి



మహానంది, పల్లె వెలుగు సర్ నమోదులో లోపాలు సవరించాలని జిల్లా స్పెషల్ ఆఫీసర్, ఎలక్షన్ రోల్ అబ్జర్వర్ ప్రశాంతి పేర్కొన్నారు మంగళవారం మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. బీఎల్ఓలను సర్ ప్రక్రియ, డెత్, షిఫ్టెడ్, డూప్లికేట్, ఓటర్ల నమోదు గురించి అడిగి తెలుసుకుని,పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీఓ చల్లా విశ్వనాథ్, మహానంది తహశీల్దార్ రమాదేవి, వీఆర్వోలు మోహన్, వెంకటలక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి




మహానంది, పల్లె వెలుగు ఆరోగ్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేసి,వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కాంటాక్ట్ ఎంప్లాయిస్ జైన్ యాక్షన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఉద్యోగులు సికిందర్,జోష్నా నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ..ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు మరణిస్తే రూ.50 లక్షలతో పాటు కుటుంబంలో ఉద్యోగం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు సిద్ధమవుతామన్నారు.

# కోడి గుడ్డు పై మదర్ థెరిస్సా చిత్రం



నంద్యాల ప్రతినిధి. ఆగస్ట్ 25 . (పల్లె వెలుగు ):నంద్యాలలకు చెందిన డి మాణిక్య రావు ఒక ప్రవేట్ బ్యాంకు పని చేస్తూ మదర్ థెరిస్సా జన్మదినం సందర్భంగా కోడి గుడ్డు పై మదర్ థెరిస్సా చిత్రం ను వేయడం జరిగినది. దీనిని డ్రాయింగ్ చేయడానికి దాదాపు రెండు గంటల సమయం పట్టినది. మదర్ థెరిస్సా అంటే నాకు ఎంతో ఇష్టం ఆమె చేసిన సేవా కార్యక్రమలు ఆమె చేసిన పరిచర్య నన్ను ఎంతగానో ఆకర్షించినవి ఎంతగానో ప్రేరేపించినవి. మదర్ థెరిస్సా మీద ఉన్న అభిమానం తో ఈ చిత్రం ను వేయడం జరిగినది

# రహదారులపై చెత్త వేస్తే జరిమానా

☛నగర స్వచ్ఛతకు సహకరించని వారిపై ఉదాసీన వైఖరి తగదు

☛వాణిజ్య దుకాణదారులకు కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరిక






పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : కర్నూలు నగరంలోని రహదారులపై చెత్త వేసే వారిపై ఉదాసీన వైఖరి తగదని, నగర స్వచ్ఛతకు సహకరించని వాణిజ్య దుకాణదారులకు జరిమానా విధించాలని నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు పారిశుద్ధ్య పర్యవేక్షక యంత్రాంగానికి ఆదేశించారు. మంగళవారం ఎన్ఆర్ పేట, గాంధీనగర్, 5 రహదారుల కూడలి, రివర్‌వ్యూ కాలనీ, రాజ్ విహార్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఎన్ఆర్ పేటలో పలు దుకాణదారులు షాపుల ఎదుట డస్ట్ బిన్‌లు లేకపోవడం, రహదారులపైనే చెత్త వేయడంపై కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే అటువంటి వారిని గుర్తించి, హెచ్చరించాలని, పద్ధతి మార్చుకోకపోతే జరిమానా విధించి, ట్రేడ్ లైసెన్స్ రద్దు చేసి దుకాణాన్ని సీజ్ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా రాజ్ విహార్ దర్గా ప్రాంతాన్ని సందర్శించి, బుధవారం జరగనున్న మిలాద్ ఉన్ నబి వేడుకలకు సంబంధించి పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించండి:ఎస్సై



మహానంది, పల్లె వెలుగు ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యం చేరాలని మహానంది ఎస్ఐ ఎన్.రామ్మోహన్ రెడ్డి సూచించారు. మంగళవారం మహానంది మండల పరిధిలోని గాజులపల్లె- నంద్యాల రహదారి ఆంజనేయపురం చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హెల్మెట్, సరైన పత్రాలు లేని పలువురికి జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ ధరించక పోవడంవల్ల రోడ్డు ప్రమాదాలలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ఈ తనిఖీల్లో మహానంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అభ్యంతరాలపై తహసిల్దారు విచారణ



బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 25 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) కార్యక్రమానికి సంబంధించి తాసిల్దార్ పద్మావతమ్మ విచారణ నిర్వహించారు. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న పార్నపల్లి గ్రామంలో మంగళవారం తాసిల్దార్ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితాలో అర్హులైన పౌరుల పేర్లు ఉండేలా చర్యలు తీసుకుంటామని నిబంధనల ప్రకారం అభ్యంతరాలను పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్క పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకొని సర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తాసిల్దార్ పేర్కొన్నారు. ఓటు హక్కు కు అర్హత ఉన్నప్పటికీ ఓటర్ జాబితా లో పేరు లేకపోయినప్పటికీ వివరాల్లో తప్పులు ఉంటే సరైన ఆధారాలతో తమ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు వయసు నుండి ఓటు హక్కుకు అర్హత కలిగిన యువకులు తమ ఓటరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ నాగరాజు సూపర్వైజర్లు నాగేశ్వరయ్య,అబ్దుల్ కలాం, బిఎల్వోలు మాధవి, శ్రీకాంత్,అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యార్థులపై వింత ఆంక్షలు

బండి ఆత్మకూరు పల్లె వెలుగు ఆగస్టు 25: మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల వ్యక్తిగత అలంకరణలపై వింత ఆంక్షలు విధిస్తున్నారన్న విమర్శలు గుప్పు మంటున్నాయి.నుదుటిపై బొట్టు పెట్టుకోకూడదని, జడలో పూలు పెట్టరాదని, కాళ్లకు పట్టీలు, చేతులకు గాజులు ధరించకూడదని కొందరు ఉపాధ్యాయులు ఆంక్షలు విధిస్తున్నట్లుగా సమాచారం. జడకు రిబ్బన్లు సైతం తాము సూచించిన విధంగానే కట్టుకోవాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. పాఠశాల నాయకత్వం వహించే విద్యార్థినీ, విద్యార్థులతోనే ఈ ఆంక్షలను తోటి విద్యార్థులపై అమలు చేయించినట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనలు పక్కనపెట్టి పాఠశాలలో సొంత నిబంధనలు అమలు చేసే అధికారం వీరికి ఎవరిచ్చారు? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఈ వ్యవహారాన్ని ప్రోత్సహించిన ఉపాధ్యాయులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? పాఠశాలలో ఇలాంటి పద్ధతులకు అడ్డుకట్ట వేయకుండా మండల విద్యాశాఖ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది ప్రశ్నార్థకంగా మారింది. చదువు చెప్పాల్సిన బడిలో వ్యక్తిగత ఆదేశాలే నిబంధనలుగా మారితే.. పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తున్నట్లు? ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయా? ఇకపై ఇలాంటి పద్ధతులు పునరావృతం కాకుండా మండల విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.

# పేద రోగులకు సీఎం చంద్రబాబు కొండంత భరోసా.

**32 మందికి రూ. 30,46,059 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పేద రోగులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొండంత భరోసా ఇస్తున్నారని, తాను ఎంపీ గా సిఫారసు చేసిన వెంటనే బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నిధులు మంజూరు చేసి వారికి తమ ప్రభుత్వం అండగా ఉందన్న మనోధైర్యం సీఎం చంద్రబాబు కల్పిస్తున్నారని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

నంద్యాల బొమ్మలసత్రం లోని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కార్యాలయంలో 32 మంది బాధితులకు రూ. 30,46,059 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ భాధితులు ఈశ్వర రెడ్డి, బేతంచెర్ల రూ.

3,01,977 లు, బొర్రబేని వెంకటేశ్వర్లు యాదవ్, ఎన్. కొత్తపల్లి రూ. 30,786 లు,

పి కిరణ్ కుమార్, నీలివిధి రూ.

26,884 లు, బోయ యెల్ల నాయుడు, శివపురం రూ. 36,500 లు, వడ్డే పార్వతి రైతునగరం రూ. 35,028 లు, ఎం.నరేంద్రనాథ్ రెడ్డికి మరణం గోవిందపల్లి, రూ.53,500 లు,

రొడ్డ సురేష్ కుమార్, ముజ్జాఫర్‌నగర్ రూ. 2,26,641 లు, షేక్ షఫీవున్, కొత్తపల్లి రూ. 60,781లు, కర్ణాటి విశ్వనాథ్ రెడ్డి, శ్రీశైలం రూ. 1,53,930 లు మాదినేని పర్వత నాయుడు ఎర్రగుడి, బనగానపల్లి రూ.1,30,267 లు, బొబ్బిటి ప్రభాకర్ రెడ్డి, నంద్యాల రూ. 1,76,539 లు, పెద్ద ముంతల నాగరత్నమ్మ శ్రీ నగర్ కాలనీ నంద్యాల, రూ. 70,000 లు, మహమ్మద్ , షరీఫున్ బీ, సిరివెళ్ల రూ.1,00,310 లు, గుర్రం సుధా రాణి, మంచాలకట్ట రూ. 26,218 లు, దుదేకుల రేషమ్మ, కరిమద్దల రూ. 20,675 లు, వెంకట లక్ష్మమ్మ, రుద్రవరం రూ. 68,415 లు, వర్రా ఈశ్వరమ్మ, మూలసాగరం నంద్యాల రూ. 25,000 లు, ముక్కు సుబ్బలక్ష్మి, నంద్యాల రూ. 70,000 లు, మల్లిశెట్టి నాగ పూజిత, రాఘవేంద్ర నగర్, కర్నూలు రూ. 27,000 లు, పాణ్యం తులసమ్మ,

నల్లగట్ల రూ. 92,445 లు, మల్లేల శివశంకర రెడ్డి గువ్వలకుంట్ల రూ. 1,00,567 లు, కొడితేం రామచద్రయ్య బనగానపల్లి రూ. 66,713 లు మల్లిరెడ్డి శ్రీనాధరెడ్డి, పెద్ద దేవలాపురం, శ్రీశైలం రూ, 35,000 లు, చిక్కొండ అయ్యన్న, బుజనూరు, పాణ్యం రూ. 30,000లు, వేణుగోపాల్ రెడ్డి, మూలసాగరం, నంద్యాల 2,46,454 లు, మేరమ్మ, వడ్డెమాన్, రూ.20,464 లు, మొల్లా రహిమాన్ బేగ్, వెలుగోడు, శ్రీశైలం రూ. 51,310లు, సుంకన్న, పెద్దపాడు, పాణ్యం రూ.52,655 లు, ఎన్. సావిత్రమ్మ, రుద్రవరం రూ. 45,000 లు, మాల జ్యోతి, సంజామల, రూ.65,000 లు, మైలా మాధవ కృష్ణయ్య, అయ్యలూరు, రూ.64,781లు, ఎం. శివ రామసుబ్బారెడ్డి, బనగానపల్లె రూ. 6,00,000 లక్షలు, ఇలా మొత్తం 32 మంది కి రూ 30,46,059 లక్షల సీఎం ఆర్ ఎఫ్ చెక్కులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పంపిణీ చేశారు. మా ఆసుపత్రి ఖర్చులకు సహకరించమని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని కోరగా వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సిఫారసు చేసి మాకు అండగా ఉండేందుకు అవసరమైన సీఎం సహాయ నిధి నిధులు మంజూరు చేసి ఆదుకున్న ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి, సీఎం చంద్రబాబుకు భాధితులు ధన్యవాదములు తెలిపారు.

# మంత్రాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర స్వామివారిని దర్శించుకున్న,

☛రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు,

☛రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, ఆరోగ్యం..

☛రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్ధనలు,





మంత్రాలయం పల్లె వెలుగు ఆగస్టు 25 మంత్రాలయంలోని ప్రసిద్ధ శ్రీ గురు రాఘవేంద్ర స్వామి మఠాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ, కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి. వి జయ నాగేశ్వర రెడ్డి, మంత్రాలయం ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి, టి.డి.పి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, జోన్ -5 ఇంచార్జి శ్రీనివాస రెడ్డి మంగళవారం భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ గురు రాఘవేంద్ర స్వామివారి బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు, ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం మఠ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ సుభుధేంద్ర తీర్థ స్వామివారు మంత్రులకు శేషవస్త్రం కప్పి, ఫలమంత్రాక్షితలు, తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు అందించారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంత్రుల మఠం దర్శనానికి ముందుగా మంచాలమ్మ గ్రామదేవతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు, జిల్లా అభివృద్ధి, సుఖసంతోషాల కోసం ప్రార్ధనలు చేశారు.

# పారదర్శక ఓటరు జాబితాలకు సహకరించాలి

**● ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే ఆధారాలతో రాతపూర్వకంగా తెలియజేయాలి ● అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా చర్యలు ● ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎలెక్టోరల్ అబ్జర్వర్ బి.లావణ్య వేణి, ఐఏయస్**




పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : పారదర్శక ఓటరు జాబితాల రూపకల్పనకు అన్ని రాజకీయ పార్టీలు, ఓటర్లు సహకరించాలని, ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలుంటే తగిన ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని కర్నూలు జిల్లా ఎస్ఐఆర్ ఎలెక్టోరల్ అబ్జర్వర్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.లావణ్య వేణి, ఐఏయస్ సూచించారు. మంగళవారం నగరంలోని పాతబస్తీ కింగ్ మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 248వ పోలింగ్ బూత్‌లో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్ డేను కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మృతులు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారు, ఆచూకీ లేని వారు, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించిన వివరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వివరాలకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యంతరాలకు సంబంధించి తగిన ఆధారాలను జతచేసి రాతపూర్వకంగా సమర్పించాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవడం ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచి, వాటిని పరిశీలించేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల నుంచి అందే క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హత మేరకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు క్రియాశీలకంగా భాగస్వాములై ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేందుకు సహకరించాలని కోరారు.ఈఆర్వో చల్లా ఓబులేసు మాట్లాడుతూ.. కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలోని వివరాలను ప్రతి ఓటరు పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సవరణలు ఉంటే నిర్ణీత గడువులో సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హులైన పేర్లు తొలగించేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు తహశీల్దార్ రవికుమార్, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, కార్యదర్శి నాగరాజు, బిఎల్వోలు, సూపర్వైజర్‌లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# లింగ సమానత్వంతోనే సమాజ వికాసం



పల్లె వెలుగు:మహిళలు ఆకాశంలో సగం దేశ జనాభాలో సగభాగమున్న మహిళలు పురుషులు సమానమేనని భారతరాజ్యాంగంచెబుతోంది .సమాన అవకాశాలు కల్పిస్తామని పాలకులు తరచూ చెప్తుంటారు కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నాయని వరల్డ్ ఎకనామిక్ ఫోరంనివేదికలో తేలింది.ప్రస్తుత పరిస్థితులు ఇలాగే కొనసాగితే సమానత్వం కోసం మహిళలు వందేల్లు నిరీక్షించాలని అంతే కాకుండా స్త్రీ పురుష అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది .2006 నుంచి పోలిస్తే ఈ ఏడాది స్త్రీ పురుషుల అసమానతలు పెరిగాయని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. .ప్రపంచ వ్యాప్తంగా 144 దేశాల్లోని విద్య' వైద్య 'రాజకీయ' ఆర్థిక విషయాల్లో మహిళల భాగస్వామ్యం అధ్యయనం చేసి వరల్డ్ ఎకనామిక్ ఫోరం సమగ్ర నివేదికను రూపొందించింది.మగవాళ్ళకు వున్న అవకాశాల్లో స్త్రీలకు కేవలం 68 శాతం మాత్రమే ఉన్నాయని నివేదిక తెలిపింది.వివక్షత శ్రమ దోపిడీ లింగ అసమానత లు స్త్రీల పాలిట శాపమైంది స్త్రీలను కేవలం సెక్స్ సింబల్ గా చూసే వాతావరణం చోటు చేసుకోవడం .ఆందోళన కలిగిస్తోందని నివేదిక స్పష్టం చేసింది బడిలో చదువుకునే చోట పాఠ్యపుస్తకాలలో లింగ వివక్షత పై పాఠ్యాంశాలు చోటు చేసుకున్నాయని తెలిసింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లో పురుషులతో పాటు మహిళలు సమానంగా రావాలంటే మరో 83 ఏళ్లు పడుతుందని. 2016 అంచనా వేశారు . విద్య ఆరోగ్య విషయంలో మహిళల పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది కానీ ఆర్థిక రాజకీయ విషయాలు ఆశించినంతగా మెరుగుపడలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది అని తేలింది. ఉద్యోగ రంగములో సమానత్వం రావాలంటే మహిళలు 217 యేళ్లు ఎదిరిచూడాలని అప్పటి పరిస్థితులు స్త్రీ పురుష సమానత్వ సాధనలో కీలక పాత్ర పోషిస్థాయిని వరల్డ్ ఎకనామిక్ ఫోరం తెలిపింది.ప్రపంచ దేశాలలో స్త్రీపురుష మధ్య అసమానతలు వ్యత్యాసాలులిఫిన్లాండ్ ' ఐస్లాండ్ ' స్కాండినేవియా దేశాలు స్త్రీ పురుష సమానత్వంలోముందున్నాయి.ఐస్లాండ్ లో స్త్రీ పురుష అసమానతలు 12 శాతం మాత్రమే వుంది. మొదటి 5 దేశాల్లో నార్వే ఫిన్లాండ్ స్వీడన్ నిలిచాయి. రువండాలో ప్రతి ఐదుగురు ఎంపి లలో ముగ్గురు మహిళలు వున్నారు. నికరాగువా స్లోవేనియా ఐర్లాండ్ నూజీలలాండ్ ఫిలిప్పీన్స్ మొదటి 10 రాంకుల్లో నిలిచాయి.మధ్య ప్రాచ్యం ఉత్తరాఫ్రికాలోని మహిళలు ఎక్కువ వివక్ష ఎదుర్కొంటున్నారు. సమానత్వ విషయములో యేమన్ చాలా వెనుకబడి వుంది .యెమెన్ లో 52 శాతం మాత్రమే స్త్రీ పురుషుల మధ్య సమానత్వం వుంది.భారత దేశములో లింగపరమైన అసమానతలు దుర్విచక్షణ తీవ్ర స్థాయిలో కొనసాగుతుంది. 2023 సం' నాటి వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదికలో లింగపరమైన అసమానతలో భారత్ వెనుకబడి ఉంది.2023సం" నాటి నివేదిక ప్రకారం 146 దేశాల్లో మన దేశం127 వ స్థానములో వుంది. శ్రీలంక ' మాల్దివ్ స్స 'ఘనా' మంగోలియా నేపాల్ దేశాలకంటే భారత్ వెనుకబడి ఉందని నివేదిక తెలిపింది. అమ్మాయిలు అబ్బాయిల తో సమానంగా అన్ని రంగాలలో దూసుకు పోతున్న పురుషులతో అనేక రంగాలలో దూసుకుపోతున్న లింగ పరమైన సమానత్వ కోసం మరింత కృషి జరుగాలని నివేదిక సూచించడం గమనార్హం.

మహిళా సాధికారిత విద్యావకాశాలు అందిపుచు కోవడం దేశ అభివృద్ధికి దోహదపడే అంశమని ప్రధాన మంత్రి నరేంద్ర మోడి ఉద్ఘాటించారు. వరల్డ్ బ్యాంక్ రిపోర్ట్ ప్రకారం దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి రోజుల్లో ప్రతి 11 మంది అమ్మాయిల్లో చదువుకున్నా వారు ఒకరు మాత్రమే ఉన్నారని తేలింది. నాడు9 శాతం వున్న స్త్రీల అక్షారాస్యత నేడు77 శాతానికి చేరింది. ఉన్నత విద్య సాంకేతిక విద్య వృత్తి విద్యల్లో వారి స్థాయి వారి అభివృద్ధిలో కీలక పాత్ర నిర్వహిస్తుంది.అఖిలభారత ఉన్నత విద్యా సర్వే2020బి2021 ప్రకారం దేశవ్యాప్తంగా కళాశాలల్లో యూనివర్సిటీలలో చేరే అమ్మాయిల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది.

2019-2020 లో1.8 కోట్ల మంది విద్యార్థినులు ఉన్నత. విద్య కొరుసుల్లో.చేరగా2020బి2021 నాటికి.వారి సంఖ్య2.1 కోట్లకు పెరిగింది. అయినప్పటికీ దేశ వ్యాప్తంగా సాంకేతిక ఇంజనీరింగ్ కోర్సుల్లో(30శాతం) మేనేజ్మెంట్ కోర్సుల్లో చేసే అమ్మాయిల సంఖ్య (40 శాతం) నమోదు అయినట్లు అఖిల భారత ఉన్నత విద్య సర్వే వెల్లడించింది. 21 వ శతాబ్దములో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మహిళలు దేశాభివృద్ధికి సారథ్యం ఎలా వహిస్తారు సంశయంగా వుంది.

శ్రామిక శక్తి మహిళా. వాటా

దేశంలో శ్రామిక శక్తిలో మహిళా వాటా2018-2019 లో దేశ శ్రామిక శక్తిలో గ్రామీణ మహిళల భాగస్వామ్యం19.7 శాతం ఉండగా 2020బి2021 నాటికి27.7 శాతానికి చేరింది 2022బి2023 నాటి ఆర్థిక సర్వేలో వెల్లడైంది. పీర్యడికల్ లేబర్ ఫోర్స్ కాలానుగుణ కార్మిక శక్తి సర్వే ప్రకారం2021బి22 లో దేశములో 15 యేళ్ళ లోపు ఆడపిల్లల్లో 32.80 శాతం శ్రామిక శక్తిలో భాగస్వాములు అయ్యారని కొద్ది రోజుల క్రితం ప్రభుత్వం లోకసభలో వెల్లడించింది దేశములో.జరిగే పలు రకాల ఆర్థిక కార్యక్రమాలలో మాహిలల భాగస్వామ్యం ఆశించ విధంగా లేదు కొన్ని రంగాలలో మహిళలు స్వశక్తితో ఎదుగుతున్నపప్టికి ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ పేద మధ్య తరగతి మహిళలు ఉన్నత స్థాయికి చేరుకోలేక పోతున్నారు సమాజములో ఉన్న కొన్ని సామాజిక పరిస్థితులు మహిళలను రెండవ తరగతి పౌరులుగా బావించే సమాజ స్థితి పురుషుల మీద ఆధారపడి వుండడం మొన్నగు పరిస్థితులు వారిని ఎదుగనివ్వడం లేదు. ఆసక్తి ప్రతిభ వున్నప్పటికీ ఆర్థిక కార్యకలాపల్లో వారి బాగస్వామ్యం అల్పంగ వుంది.

లిలింగ వివక్షలిభారత్ దేశములో స్త్రీ పురుష అసమానతలు లింగ వివక్ష రూపుమాపితే 2025 నాటికి భారత దేశ ఆర్థిక వ్యవస్థలో స్థూల జాతీయ ఉత్పత్తికి అధనంగ 77 వేలకోట్ల డాలర్లు చేకూరుతాయని గతములో మేకెన్సి గ్లోబల్ ఇన్స్టిట్యూట్ అధ్యయనంలో వెల్లడైంది ఇది పాలకులకు కను విప్పు కావాలి. మహిళాభివృదికి ప్రభుత్వం సంస్థాగత సంస్కరణలు మార్పులు పాలనా పరమైన మార్పులు చేపట్టాలి.ఆడపిల్లలను బారంగ బావించే మానసిక స్థితి నుండి సమాజం బయట పడాలి .కుటుంబంలో మగ పిల్లలు ఆడపిల్లలు అన్న వివక్ష చూపకుండ సమానత్వాన్ని పాటించాలి. ఆడపిల్ల" ఆడపిల్లే" అన్న సామాజిక వాతావరణాన్ని సమూలంగా మార్చాలి. కడుపులో పెరుగుతుంది ఆడ శిశువు అని తెలియగానే ఆడ శిశువును అమ్మ కడుపులోనే మట్టు బెట్టే భ్రూణ హత్యలను నిషేధించాలి. ఆడశిశువులను అంతం చేసే కార్యకలాపాల మీద చట్టబద్ధమైన కఠిన చర్యలు అమలు చెయ్యాలి. దేశప్రగతికి మహిళా లోకం చోదక శక్తిగా ఎదగటానికి మహిళలు పనిచేసే చోట విద్యాలయాల్లో బహిరంగ ప్రదేశాల్లోనూ మహిళలకు సురక్షిత వాతావరణాన్ని కల్పించాలి. మహిళా హక్కుల రక్షణ 'బరోసా' భద్రత కల్పించాలి. మహిళ మీద జరిగే అత్యాచారాలు దాష్టికాలు అరికట్టడానికి సత్వర విచారణ చేపట్టి బాధితులను శిక్షించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి.

సమాజాన్ని పితృస్వామిక వ్యవస్థ నుండి విముక్తి.చేయడానికి మహిళా.సంఘాలు 'యువజన సంఘాలు స్వచ్ఛంద సంస్థలు' లింగ సమానత్వం మీద చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి.పాఠ్యాంశాల్లో లింగ వివక్షత .అంశాలను తొలగించాలి.మహిళా సాధికారిత విద్యావకాశాలు అభివృధి వ్యూహాలను సమస్యలను పరిశోధన చేయడానికి అమ్మాయిలను ప్రోత్సహించాలి. సమాన పనికి సమాన వేతన చట్టాలను అమలు చెయ్యాలి. పారిశ్రామిక' సేవా రంగాల్లో ఔత్సాహిక మహిళను ప్రోత్సహించడానికి బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలి.మహిళాభివృది కేంద్రంగా వ్యవసాయ 'పారిశ్రామిక 'సేవా రంగాలలో అభివృధి వ్యూహాలను అమలు చేసినపుడు మాత్రమే మహిళా అభివృధి జరిగి మహిళా ఆర్థిక సాధికారత సాధ్యమౌతుంది.(ఆగస్టు 26 ప్రపంచ మహిళా సమానత్వ దినోత్సవం సందర్భంగా)

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు ఆర్థికవేత్త రచయిత కాలమిస్ట్
తెలంగాణ ఎకనామిక్ ఫోరంకరీంనగర్.

## నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

- ☛ఆగస్టు 30న ప్రవేశ పరీక్ష
- ☛ఉదయం 8:30 గంటల వరకే అనుమతి
- ☛పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ఆగస్టు 30న జరిగే నీట్ పీజీ ప్రవేశ పరీక్షలను జిల్లాలో పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత అధికారులు, కళాశాలల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా కర్నూలు నగరంలో 5, ఆదోని, ఎమ్మిగనూరులలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 7 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కలెక్టర్ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు, సూచనలు: సమయపాలన తప్పనిసరి: ఆదివారం ఉదయం 7 గంటల నుంచే అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 8:30 గంటలలోపు పరీక్ష హాలులోకి చేరుకోవాలి. ఆ తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోరు. పరీక్ష ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు కొనసాగుతుంది. ఎలక్ట్రానిక్ వస్తువులపై నిషేధం: మొబైల్ ఫోన్లు,





ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. కేంద్రాల్లో మౌలిక వసతులు: అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు, గదుల వివరాలు స్పష్టంగా కనిపించేలా పెద్ద బోర్డులు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలి. తాగునీరు, గాలి, వెలుతురు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ సౌకర్యాలు సమకూర్చాలి. వైద్య, రవాణా సదుపాయాలు: ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులు, వైద్య సిబ్బందితో కూడిన మెడికల్ క్యాంప్, అంబులెన్స్ సిద్ధంగా ఉంచాలి. అభ్యర్థుల రద్దీకి అనుగుణంగా కళాశాలల వరకు ఆర్టీసీ బస్సులు నడపాలి. కట్టుదిట్టమైన భద్రత: పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలి. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలి. ఈ సమావేశంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, తహసీల్దార్లు వెంకట రమేష్, ఆంజనేయులు, రవికుమార్, విద్యుత్ శాఖ డీఈ విజయ భాస్కర్, ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి, కళాశాలల ప్రతినిధులు రామేశ్వర్ రెడ్డి, రాఘవేంద్ర, నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట: ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- ☛కొంతలపాడు, గుట్టపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- ☛ఇంటింటికీ సంక్షేమ పథకాల వివరణ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరోకూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తోందని పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కొంతలపాడు, గుట్టపాడు గ్రామాల్లో పూర్తయిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శనివారం ఘనంగా ప్రారంభించారు.

కొంతలపాడు గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో కర్రెమ్మ గుడి నుంచి ఉప్పలపాడు వెళ్లే రహదారి వరకు నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గుట్టపాడు గ్రామంలో రూ. 44 లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ సంప్, రూ. 15 లక్షలతో వేసిన సీసీ రోడ్డు, రూ. 29 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన హెల్త్ సెంటర్ భవనాన్ని ఆమె ప్రారంభించారు.




అనంతరం ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి స్థానిక ప్రజలతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన రెండేళ్ల పాలనలోని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, ప్రజలకు అందుతున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, మండల అధ్యక్షులు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గోవింద్ రెడ్డి, గుట్టపాడు మోహన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ పాలకొలను సుధాకర్ రెడ్డి, శ్రీరాములు, మైనారిటీ నాయకులు మహబూబ్ బాషా, కొంతలపాడు గ్రామ నాయకులు చంద్రప్ప, శ్రీను, హరితో పాటు ప్రభుత్వ అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మంత్రులకు ఘన స్వాగతం..

## నియోజకవర్గ సమస్యలపై వినతి

హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 25మంత్రాలయం నియోజకవర్గ పర్యటనకు విచ్చేసిన



రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్లకు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు.

టీడీపీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్, ఎస్. పాంపాపతి, యరిస్వామి, యువనాయకులు ఈబీజీ రాజేంద్ర గౌడ్, దీదీ నాగప్ప, కన్నయ్య తదితరులు మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.ఈ సందర్భంగా నాయకులు నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి సమస్యలు, విద్యుత్ సరఫరా, రైతుల సమస్యలు తదితర అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సాగునీరు, విద్యుత్ సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు సహకరిస్తామని నాయకులు తెలిపారు. టీడీపీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తల సంక్షేమం కోసం సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు.


## 8వ వార్డు సచివాలయంలో ఆకస్మిక తనిఖీ.

### రికార్డులు, ప్రజాసేవలపై అసిస్టెంట్ కమిషనర్ పరిశీలన.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. నంద్యాల పట్టణంలోని 8వ వార్డు సచివాలయాన్ని అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణి బాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని సిబ్బంది హాజరు, రికార్డుల నిర్వహణ, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలు, వినతులను సకాలంలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందేలా బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సచివాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, కార్యాలయ నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని సూచించారు. ఈ ఆకస్మిక తనిఖీతో సిబ్బందిలో అప్రమత్తత పెరిగింది.

## కరెంట్ వైర్‌పై పాము..
### విద్యుత్ సరఫరాకు అంతరాయం



హోళగుంద పల్లె వెలుగు ఆగస్టు : 25 మండల పరిధిలోనీ గజ్జహల్లి గ్రామంలో విద్యుత్ ఫాల్ట్ ఏర్పడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభం వద్దకు పాము ఎక్కి విద్యుత్ వైర్లకు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి పాము అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు వెంటనే మృతి చెందిన పామును తొలగించారు. అనంతరం విద్యుత్ లైన్‌లో ఏర్పడిన సమస్యను పరిశీలించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.ధ

## మండల అధ్యక్షులుగా వాల్మీకి దండు వీరేష్,,

నందవరం పల్లె వెలుగు ఆగస్టు 25భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు,




కర్నూలు జిల్లా అధ్యక్షులు అక్కమ్మతోట రామకృష్ణ మరియు బీజేవైఎం కర్నూలు జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు, కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి గురురాజ్ దేశాయ్ నందవరం మండల అధ్యక్షులు మఠం రాజశేఖర్ స్వామి , కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీ మజారా లోకేష్ , కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రవీణ్ రెడ్డి , బీజేవైఎం ఎమ్మిగనూరు పట్టణ అధ్యక్షులు బంగి రాజేష్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు నియోజకవర్గం బిజెపి అసెంబ్లీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బీజేవైఎం నందవరం మండల అధ్యక్షులుగా వాల్మీకి దండు వీరేష్ ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. యువతను ఏకం చేస్తూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, నందవరం మండలంలో బీజేవైఎంను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని దండు వీరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు బి ల్ నారాయణ , పట్టణ ఉపాధ్యక్షులు గాజుల సురేంద్ర మల్లికార్జున, కళ్ళైల్ శివ, ఆది ఆంధ్ర స్కూల్ చైర్మన్ శివ, హరి, పంపయ్య, తిమ్మప్ప మరియు కార్యకర్తలు పాల్గొన్నారు..

## ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలంలోని గ్రామ పంచాయతీల లో కులాల




వారీగా ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించినట్లు ఎంపీడీవో భాగ్యలక్ష్మి మంగళవారం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పంచాయతీలలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్లను గుర్తించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఫారం 1 ద్వారా ప్రచురించడం జరిగిందన్నారు. ముసాయిదా జాబితా పై ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు పై అభ్యంతరాలను ఈనెల 28 వరకు (ఫారం-2, ఫారం-3, ఫారం-4) ద్వారా స్వీకరించటకు గ్రామపంచాయతీ కార్యాలయాలలో తగిన ఏర్పాట్లు చేయడం జరిగింది అని తెలిపారు. గ్రామాలలోని ఓటర్లు ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలించి అభ్యంతరాలను సరి చేసుకోవాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి మండలంలోని 21 గ్రామపంచాయతీలలో పోలింగ్ కేంద్రాల వివరాలు కూడా గ్రామపంచాయతీ కార్యాలయం లో అందుబాటులో ఉంచడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

## మంత్రులకు సన్మానం

**నీటి ప్రాజెక్టులు, అభివృద్ధిపై, ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి,**



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 25 ఎమ్మిగనూరులోని =ఒదీ గెస్ట్ హౌస్‌లో కర్నూలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు , రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి శ్రీ గొట్టిపాటి రవికుమార్, కర్నూలు ఎంపీ శ్రీ బస్తిపాటి నాగరాజు టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ శ్రీ పెల్లకూరు శ్రీనివాసులు రెడ్డి కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు గుడిసె ఆదికృష్ణమ్మ , టీడీపీ ప్రతినిధులను ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి మంత్రులు, ముఖ్య నాయకులతో ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని సాగునీరు, తాగునీరు, నీటి ప్రాజెక్టులు మరియు వాటి పురోగతిపై విస్తృతంగా చర్చించారు. నియోజకవర్గ రైతులకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం 'రెండేళ్ల చీణూ ప్రభుత్వం -- నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం' ఇంటింటి ప్రచారం, ూ×= (ూజూవఒఖుశ్రీ ×త్వఅంఅజవ =వజఅంఅశీఅ) ప్రక్రియ ప్రస్తుత పరిస్థితి, అలాగే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల ప్రణాళిక, పార్టీ కార్యక్రమాలపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

## వాస్సర్ ల్యాబ్స్ బృందం ద్వారా పంటల పరిశీలన.

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం మండలం ఏపీ ఏఐ ఎంఎస్ యాప్ ద్వారా రైతులకు



లోని ఎర్రగుడిదిన్నె, చిలకలూరు, పేరూరు గ్రామాల మధ్య లో విజయవాడ కు చెందిన వాస్సర్ ల్యాబ్స్ సాంకేతిక నిపుణుల బృందం మండల వ్యవసాయాధికారి జి.సుమతి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయి పంటలు పరిశీలించారు . అందిస్తున్న వాతావరణ సూచనలు తుఫాను మరియు కరువు హెచ్చరికలు యాప్ పనితీరును సాంకేతిక సిబ్బంది సాయిచరణ్, తిరుపతి సమన్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంట సాగు విస్తీర్ణం పంట ఆరోగ్య పరిస్థితి మరియు యాజమాన్య పద్ధతులపై సమాచారము రైతులకు యాప్ ద్వారా పొందవచ్చని వారు తెలిపారు. ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు సాగు చేసిన పంట పొలాల యొక్క ఆరోగ్య స్థితిని యాప్ లో అప్రమత్తంగా వచ్చిన పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు .వ్యవసాయ శాఖ ద్వారా వస్తున్న వాతావరణ సందేశాలు పంట స్థితిగతులు రైతులకు అవగాహన కల్పించి వెంటనే చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను పంపుతున్నామని వారు తెలిపారు .యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తీసుకున్న వాస్తవాలను అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తామని వారు తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి. సుమతి మాట్లాడుతూ ఖరీఫ్ 2026 రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారులు ఎం. రాజు, ఎస్. ఫహీమ తబస్సుమ్, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, నాగలక్ష్మి , భవాని , గ్రామ రైతులు పాల్గొన్నారు.

## దొర్వి చెంచు లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అభివృద్ధికి విరాళం.

రుద్రవరం. పల్లె వెలుగు : మండల కేంద్రం రుద్రవరం సమీపంలోని నల్లమల



అటవీ ప్రాంతంలో వెలసిన దొర్వి చెంచు లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళము అందజేశారు. మంగళవారం ఆలయ నిర్వాహకులు గాంధీ శ్రీనివాసులు మాట్లాడుతూ రుద్రవరం గ్రామానికి చెందిన కొల్లం మనోజ్ హైదరాబాదులో ఉంటున్నారన్నారు. వీరు దొర్వి చెంచు లక్ష్మీనరసింహస్వామి నీ దర్శించుకుని ఆలయం అభివృద్ధికి తమ వంతుగా రూ 10116 నగదు విరాళము అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు కొల్లం పుల్లయ్య తదితరులు ఉన్నారు.

## బాలికలకు చదువుతో పాటు ఆత్మ రక్షణకు కరాటే అవసరం

**కరాటే మాస్టర్ చంద్రమౌళి**





ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 25 పల్లె వెలుగు నేటి సమాజంలో బాలికలకు ఆత్మరక్షణ కొరకు కరాటే అవసరమని ప్రముఖ కరాటే మాస్టర్ చంద్రమౌళి అన్నారు మంగళవారం నాడు ఆళ్ళగడ్డ పట్టణంలోని గర్ల్స్ హై స్కూల్ లో ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో బాలికలకు ఫిట్నెస్ ప్రోగ్రాం జరిగింది ఈ సందర్భంగా ప్రముఖ. కరాటే మాస్టర్ చంద్రమౌళి అమ్మాయిలు వారి ఆత్మ రక్షనకొరకు కరాటే లో కావలసిన మెలుకువలు తదితర టిప్స్ కరాటే లో శిక్షణ పొందిన వారిచే అద్భుతమైన విన్యాసాలను ప్రదర్శించారు అలాగే.చైన్ స్నాకర్స్ నుంచి ఎలా కాపాడుకోవాలి మరియు ఆకతాయి అబ్బాయిల నుండి తాము తాము ఏ విధంగా కాపాడుకోవాలి నేర్పించారు. ఈ కార్యక్రమంలో బాలికల ఉద్దేశించి ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ బైసాని ఉమామహేశ్వరి ప్రధాన కార్యదర్శి పి గీత ప్రసంగించారు. ప్రవల్లిక వై కవిత ఎం గాయత్రి దేవి లావణ్య హెచ్ రమా భాయ్ పాల్గొన్నారు

## మహానందిలో అభివృద్ధి పనులను చైర్మన్ పరిశీలన

మహానంది, పల్లె వెలుగు మహానంది క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి



పనులను చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి పరిశీలించారు. మంగళవారం ఆయన క్షేత్ర పరిధిలో జరుగుతున్న నందీశ్వర సదనం వసతి గృహాల సముదాయం,పాద దేవస్థాన కార్యాలయాన్ని ఏఈ శ్రీనివాసులతో కలిసి పరిశీలించారు. పనులలో నాణ్యత లోపించకుండా వసతి గృహాలను నిర్మించాలని సూచనలు చేశారు.

## ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నిండాలి.

**"మిలాద్ ఉన్ నబీ " శుభాకాంక్షలు తెలిపిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి,



సంతోషం, ఆరోగ్యం, సౌభాగ్యం నిండాలని కోరుకుంటూ అందరికీ మిలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలను మైనారిటీ,న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ముస్లిం సమాజంలో ఎంతో పవిత్రంగా భావించే పండుగల్లో మిలాద్ ఉన్ నబీ ఒకటని మంగళవారం అమరావతి లో విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ప్రవక్త మహమ్మద్ జన్మదినాన్ని స్మరించుకుంటూ ఈ రోజును భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారని అన్నారు. ప్రవక్త మహమ్మద్ జీవితాన్ని, బోధనలను పాటిస్తూ, ఆదర్శంగా నిలవాలని అన్నారు.నిజాయితీ, దయ, క్షమ, ప్రేమ, సహనం, ఇతరులకు సహాయం చేయడం వంటి విలువలకు ప్రవక్త ఇచ్చిన ప్రాధాన్యతను ఆదర్శంగా తీసుకోవాలని కోరుతూ మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు మంత్రి ఫరూక్ తెలిపారు.

## పార్టీ కార్యకర్తకు శేఖరన్న పరామర్శించిన



ఎమ్మిగనూరు పల్లె వెలుగు ఆగస్టు 25 గోనెగండ్ల మండలం పిల్లిగుండ్ల గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న పార్టీ కార్యకర్త శ్రీ కురువ నాగన్న ని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ వారి నివాసంలో పరామర్శించారు. ఈ సందర్భంగా నాగన్న గారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ తరఫున, వ్యక్తిగతంగా ఎల్లప్పుడూ అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

## నేటి మొక్కలే రేపటి వృక్షాలు

ఆళ్లగడ్డ ప్రతినిధి ఆగస్టు 2 5 పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వృక్షయజ్ఞం వ్యవస్థాపకురాలు లావణ్య అన్నారు. పట్టణానికి సమీపంలో ఉన్న కాసింతల క్షేత్రంలో శ్రావణ మాసం సందర్భంగా మంగళవారం వృక్షయజ్ఞం సంస్థ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వృక్ష యజ్ఞం వ్యవస్థాపకురాలు లావణ్య మాట్లాడుతూ ఆళ్లగడ్డ పరిసర ప్రాంతాలలో తమ వృక్షయజ్ఞం సంస్థ ద్వారా ఇప్పటికే పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పర్యావరణానికి మేలు చేసే మొక్కలను నాటేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచితే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చున్నారు. అనంతరం సరోజమ్మ, సుబ్బమ్మ తదితర భక్తు బృందం ఆధ్వర్యంలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం, కాలభైరవాష్టకం తదితర పారాయణలు నిర్వహించి అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్వతి , పద్మావతి, శ్రీదేవి, భ్రమరాంబ, శ్రీనివాస రెడ్డి, కృష్ణారెడ్డి, దామోదర్ రెడ్డి , గ్యాస్ పుల్లయ్య, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం : ఆర్ఎస్‌యూ

## పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్లు వెంటనే విడుదల చేయాలి



రాజమహేంద్రవరం, ఆగస్టు 25 (పల్లె వెలుగు దినపత్రిక) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తూ, ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేసే విధానాలను అనుసరిస్తోందని ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ మాజీ జాతీయ నాయకుడు నూర్ మహమ్మద్ విమర్శించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని లయన్స్ క్లబ్‌లో ఆర్ఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేంద్ర అధ్యక్షతన ఆర్ఎస్‌యూ ప్లీనరీ సమావేశం జరిగింది. అంతకుముందు పుష్కర్ ఘాట్ నుంచి లయన్స్ క్లబ్ వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగ నియామకాల అక్రమాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, నీట్ వంటి ప్రవేశ పరీక్షల్లో పేపర్ లీకేజీలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల కొరత తీర్చి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా సంక్షేమ హాస్టల్ విద్యార్థి హర్షవర్ధన్ మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బాధితుని కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కోరారు. హాస్టళ్లలో భద్రత, పారిశుధ్యం మెరుగుపరచకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తొండం ప్రశాంత్, రాష్ట్ర అధ్యక్షులు రఘురామిరెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేందర్‌రెడ్డి, శాంతి, రాష్ట్ర కమిటీ సభ్యులు అవినాష్, కొండయ్య, కిరణ్, నరేష్ నాయుడు, చందు, కళిందర్, కౌశిక్ పాల్గొన్నారు

---

# క్యాన్సర్ ను తొలిదశలో నిర్ధారించడం ద్వారా వ్యాధి నివారణ సాధ్యం

**● శ్రీ వాసవి మహాత్మా గాంధీ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**



రావులపాలెం, ఆగస్టు 25 (పల్లె వెలుగు దినపత్రిక) క్యాన్సర్ ను తొలి దశలో గుర్తించడం ద్వారా పూర్తిగా వ్యాధి నివారణ సాధ్యమవుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం రావులపాలెంలో రావులపాలెం శ్రీ వాసవీ మహాత్మా గాంధీ సేవాసమితి, శ్రీ వాసవీ ఆర్యవైశ్య సంఘం వారి సహకారంతో అపోలో క్యాన్సర్ సెంటర్, విశాఖపట్నం వారిచే ఏర్పాటు చేయబడిన ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరం, ఉచిత రక్త సంబంధిత వ్యాధుల పరీక్షల నిర్ధారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. ముందుగా ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు, సభ్యులు, అపోలో గ్రూప్ కు సంబంధించిన వైద్యులను ఆయన అభినందించారు. వైద్య రంగంలో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ కు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. ప్రస్తుత కాలంలో క్యాన్సర్ ను గుర్తించడంలోనే ఆలస్యం జరుగుతుందన్నారు.క్యాన్సర్ చివరి స్టేజీలో గుర్తించడం వల్ల, అప్పటికే రోగి పరిస్థితి చేయి దాటిపోతుందన్నారు. ముందస్తుగా క్యాన్సర్ వ్యాధిని నిర్ధారించడం వల్ల దాన్ని పూర్తిగా తగ్గించవచ్చని ఎమ్మెల్యే తెలియజేశారు. కోనసీమ ప్రాంతంలో క్యాన్సర్, కిడ్నీ వ్యాధుల పేషంట్లు అధికంగా ఉంటున్నారన్నారు. ప్రజల జీవన విధానంలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, కలుషితమైన నీరు, మానసిక ఒత్తిడి మొదలైన అంశాల వల్ల ఈ వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్త్రీలకు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరిగిందన్నారు. సేవా దృక్పథంతో విశాఖపట్నం నుంచి రావులపాలెం వచ్చి ఈ శిబిరం నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాలకు సైతం తమ వైద్య సేవలు అందించాలన్న వారి దృక్పథం అభినందనీయమన్నారు. వాసవీ,మహాత్మా గాంధీ ఆర్యవైశ్య సంఘం సమాజపరంగా అందిస్తున్న సేవలు అపూర్వమైనవని ఆయన కొనియాడారు. మహిళలకు ఉపాధి కల్పించడంలో వారు చేస్తున్న కృషి, చిన్నపిల్లలకు విద్య అందించడం, క్రీడల్లో ప్రోత్సహించడం, చిన్నారుల నుంచి పెద్దవారి వరకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయించడం, దంత వైద్య శిబిరాలు నిర్వహించి ఆపరేషన్లు చేయించడం వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగినా, వరదలు వచ్చినా, తుఫానులు వచ్చినా, పుష్కరాలు వచ్చినా, సమాజానికి ఏ అవసరం వచ్చినా ఈ సంఘం వారు వెళ్లి సహాయ సహకారాలు అందిస్తారని కొనియాడారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి వైద్య సేవలు అందించిన డా. రాకేష్ రెడ్డి, డా. నిరంజన్, డా.మాధవి వారి బృందాన్ని, దంత వైద్యులు డా. బ్రహ్మారెడ్డి తదితర వైద్యులను అభినందించారు

# పరిశుభ్రమైన నగరంగా విజయవాడను తీర్చిదిద్దాలి

విజయవాడ, ఆగస్ట్ 25 పల్లె వెలుగు విజయవాడ



నగరాన్ని గుంతల రహిత రహదారులతో పాటు పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దా లని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కమిషనర్ తన పర్యటనలో భాగంగా నేతాజీ బ్రిడ్జి, కృష్ణలంక, బందర్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితి, మొక్కల సంరక్షణ తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని, గుంతల రహిత రహదారులే లక్ష్యంగా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. రహదారులపై గుంతలు లేదా ఇతర సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులు, సర్వీస్ రోడ్లు, వంతెనల పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రహదారుల వెంట పేరుకుపోయిన చెట్ల కొమ్మలు, ఆకులు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలను గుర్తించిన వెంటనే పరిష్కరించాలని సూచించారు. సూర్యారావుపేట ప్రాంతంలో వాల్ పెయింటింగ్స్, గ్రీనరీని పెంచడం ద్వారా నగర సౌందర్యాన్ని మరింత మెరుగుపరచాలని కమిషనర్ సూచించారు. అనంతరం కృష్ణలంక సర్వీస్ రోడ్ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించిన ఆయన, రహదారులపై ఎక్కడా చెత్త, వ్యర్థాలు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే సమస్యను పరిష్కరించా లని, నీరు నిల్వ ఉండటం వల్ల దోమల ఉత్పత్తికి అవకాశం లేకుండా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు.

## అగనంపూడి సమస్యలు పరిష్కరించండి ! జీవీఎంసీ అదనపు కమిషనర్‌కు బలిరెడ్డి వినతి

అగనంపూడి/గాజువాక, ఆగస్ట్ 25పల్లె వెలుగు



జీవీఎంసీ పరిధిలోని అగనంపూడి ప్రాంతంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జీవీఎం సీ అదనపు కమిషనర్ డి.వి. రమణమూర్తికి ఎడిసిచైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవీఎంసీ 79, 85 వార్డులకు అనుసంధానంగా ఉన్న జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, ఇంటర్నెట్ కేంద్రాలకు వచ్చే వినియోగదారులు, ప్రయాణికులు, అలాగే స్థానిక ఏరియా ఆసుపత్రి రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం అగనంపూడి సెంటర్‌లోని పాత పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజా మరుగుదొడ్లను నిర్మించాలని కోరారు. అలాగే అగనంపూడి నిర్వాసిత కాలనీ ప్రజల విజ్ఞాన వికాసానికి దోహదపడేలా జాతీయ రహదారి పక్కన ఉన్న ఎన్టీఆర్ పార్కును డిజిటల్ లైబ్రరీగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. లంకెలపాలెం నుంచి కూర్మన్నపాలెం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా తక్షణమే సర్వీసు రోడ్లు నిర్మించి నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు. దీంతోపాటు 84వ వార్డు పరిధిలోని ఏలేరు కాలువలోకి కొప్పాక పరిసర ప్రాంతాల మురుగునీరు చేరి తాగునీరు కలుషితమవుతోందని, ప్రజల ఆరోగ్య దృష్ట్యా కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవా లని అధికారులను కోరారు. ఈ సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పనులు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆగి ఉన్న కారును ఢీకొట్టిన ఆటో ! ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

శ్రీకాకుళం జిల్లా/నరసన్నపేట, ఆగస్ట్25(పల్లె



వెలుగు :నరసన్నపేట బైపాస్ రోడ్డు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును కూరగాయల లోడుతో వెళ్తున్న ఓ ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. కూరగాయల లోడుతో వేగంగా వెళ్తున్న ఆటో, బైపాస్ వద్ద మార్గమధ్యంలో ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఒక్కసారిగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఆటో ముందు భాగం పూర్తిగా ధ్వంసమై కారులోకి చొచ్చుకుపోయింది. దీంతో ముందు సీట్లో కూర్చున్న ఇద్దరు యువకులు బయటకు రాలేక, స్టీరింగ్ రాడ్ల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర రక్తస్రావంతో కేకలు వేశారు. సమాచారం అందుకున్న వెంటనే నరసన్నపేట ఎస్.ఐ గణేష్ తమ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన పోలీసులు, స్థానికుల సహకారంతో ఇనుపరాడ్లను ఉపయోగించి వాహన భాగాలను తొలగించారు. దాదాపు అరగంట పాటు శ్రమించి ఇరుక్కుపోయిన క్షతగాత్రులను సురక్షితంగా బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి గల కారణాలపై విచారణ జరుపుతున్నారు. సకాలంలో స్పందించి క్షతగాత్రుల ప్రాణాలు కాపాడిన ఎస్.ఐ గణేష్, పోలీసు సిబ్బందిని స్థానికులు అభినందించారు.

# పి.పొన్నవోలులో ఇంటింటా 'సూపర్ పాలన'

రావికమతం,ఆగస్టు25 పల్లె వెలుగు ప్రతినిధి : కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను



పూర్తిచేసుకున్న సందర్భంగా పి.పొన్నవోలు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో 'సూపర్ పాలన' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు, ఎంపీటీసీ కె.అప్పారావు, పార్టీ అధ్యక్షుడు పినపాత్రుని అంజి నేతృత్వంలో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమా లను ప్రజలకు వివరించారు. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన పరిపాలన అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా బాలికల కబడ్డీ పోటీలు.. హోరాహోరీగా తలపడిన క్రీడాకారిణులు


**పందలపాక పీఎం శ్రీ పాఠశాలలో అంతర్గత క్రీడా పోటీలు**



అనపర్తినియోజికవర్గ ప్రతినిధి కర్రిదుర్గారెడ్డి,ఆగస్ట్25 పల్లె వెలుగు పందలపాక: తూర్పుగోదావరిజిల్లా అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాకలోని పీఎం శ్రీ పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాలలో నిర్వహిస్తున్న అంతర్గత క్రీడా పోటీల్లో భాగంగా నాలుగో రోజు బాలికల కబడ్డీ పోటీలు ఉత్సాహం గా జరిగాయి. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ద్వారంపూడి రాజారెడ్డి ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. బాలికల కబడ్డీ పోటీలను పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కోణాల సత్తిరాజు టాస్వేసిప్రారంభించారు. పాఠశాలలోని ఆరు హౌస్‌ల నుంచి ఆరు జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. నాకౌట్ పద్ధతిలో జరిగిన పోటీల్లో బాలికలు హోరాహోరీగా తలపడు తూ ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. క్రీడాకారిణులు మెరుగైన ఆటతీరును కనబరుస్తూ పోటీల్లో ఆకట్టుకున్నారు. విద్యార్థు ల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం తో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేం దుకు ఇలాంటి క్రీడా పోటీలుఎంతగానోఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయ ప్రతినిధి కర్రిరెడ్డి, వ్యాయామఉపాధ్యాయులు ద్వారంపూడి రామ, నాగ భీమేశ్వర్ రెడ్డి, అంజనీ కుమార్ తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## అనకాపల్లి జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి భరోసా ! ఎంపీ సి.ఎం. రమేష్

అనకాపల్లి, ఆగస్ట్25 పల్లె వెలుగు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు



డాక్టర్ సి.ఎం. రమేష్ మంగళవారం ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన పలు కీలక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, వాటి ప్రాధాన్యత, వాటి ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అదేవిధంగా అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు స్థానిక సమస్యలను సీఎం రమేష్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కి అందజేశారు.

## ఉత్తరాంధ్ర బాడీబిల్డింగ్ ఓవరాల్ ఛాంపియన్‌గా పి.సంతోష్

**ఘనంగా సత్కరించిన ఐ.ఆర్.గంగాధర్**



అనకాపల్లి, ఆగస్ట్ 25పల్లె వెలుగు ఇటీవల అనకాపల్లి గౌరీ వ్యాయామ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర బాడీ బిల్డింగ్ పోటీలలో అనకాపల్లికి చెందిన అవినాష్ పవర్ జిమ్ క్రీడాకారుడు పి.సంతోష్ అద్భుత ప్రతిభ కనబరిచి 'ఓవరాల్ ఛాంపియన్షిప్ 'కైవసం చేసుకున్నారు. ఈ ఘన విజయం పట్ల జిమ్ చైర్మన్, ప్రముఖ న్యాయవాది ఐ.ఆర్. గంగాధర్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిమ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో గంగాధర్ మాట్లాడుతూ... క్రమశిక్షణ, నిరంతర సాధనతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవు తాయని పేర్కొన్నారు. తమ అవినాష్ పవర్ జిమ్ నుంచి ఇప్పటికే ఎందరో క్రీడాకారులు తర్ఫీదు పొంది జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విశేష విజయాలు సాధించి అనకాపల్లి పేరును నిలబెట్టారని కొనియాడారు. అనంతరం ఓవరాల్ ఛాంపియన్ పి.సంతోష్‌ను జిమ్ యాజమాన్యం తరపున శాలువాతో ఘనంగా సత్కరించి, మున్ముందు జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిమ్ మేనేజర్ గొర్లి స్వామి గౌడ్, యువ న్యాయవాది ఇళ్ల అవినాష్, జిమ్ సభ్యులు శ్రీరామ్ మూర్తి, నాగేశ్వరరావు, మోహన్, కృష్ణ, జస్వంత్, శంకర్ తదితరులు పాల్గొని సంతోష్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# లారీ డ్రైవర్ పైన డాడీ చేసిన బ్రేక్ ఇన్స్పెక్టర్ పై చర్యలు తీసుకోవాలి :ఏఐటీయూసీ డిమాండ్

అనకాపల్లి,ఆగస్టు 25పల్లె వెలుగు లారీడ్రైవర్ పై దాడి చేసిన బ్రేక్ ఇన్స్పెక్టర్ పార్వతి తనవ్యక్తిగత



కార్ డ్రైవర్ పై క్రిమినల్ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకొని లారీ డ్రైవర్లకు ప్రాణ రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఆటో మోటార్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనకాపల్లి జిల్లా సమితి గౌరవ అధ్యక్షులు కోన లక్షణ, అధ్యక్ష కార్యదర్శులు పెద్దిరెడ్ల నాగేశ్వర రావు, కోరుబిల్లి జగదీష్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కోన లక్షణ, అధ్యక్ష కార్యదర్శులు పెద్దిరెడ్ల నాగేశ్వరరావు, కోరుబిల్లి జగదీష్ మాట్లాడుతూ ఈ నెల 24 న విశాఖపట్నం షీలా నగర్ జంక్షన్ వద్ద వాహనాల చెకింగ్ కి వెళ్లిన బ్రేకింగ్ ఇన్స్పెక్టర్ పార్వతి ఒక లారీ ఆపగా లారీ డ్రైవర్ లారీ ఆపకుండా వెళ్ళిపోయాడని కక్షతో లారీ కేబుల్ లో ఉన్న డ్రైవర్ పై తన వ్యక్తికి డ్రైవర్ తో దాడి చేయడం దుర్మార్గం అని అన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com